సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
మంగళవారం, 02.06.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 221
పేజీలు: 08 వెల: రూ. 5


## నేటి నుంచి పెరిగిన కనీస వేతనాలు

- 1.11 కోట్ల మందికి వేతనాల లబ్ధి
- హైస్కిల్డ్‌కు రూ.20 వేల కనీస జీతం
- 77 రంగాలకు కొత్త వేతన విధానం
- తక్కువ జీతాలపై కఠిన చర్యలు

02






సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 02.06.2026
www.mudranews.in | @mudranews



## ఆవకాయతో యాంటీఆక్సిడెంట్ల నిధి

ఆవకాయలో ఉపయోగించే స్వచ్ఛమైన నూనె, మసాలాలు శరీరానికి అవసరమైన యాంటీఆక్సిడెంట్లను అందిస్తాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, కణాల ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి.



# ఇసుక దందా ఆరోపణలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

- నాపై ఆరోపణలా? నోరు అదుపులో పెట్టుకో కొప్పుల ఈశ్వర్
- రాష్ట్ర సంక్షేమశాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్
- అకాల వర్షాలకు నష్టపోయిన వారికి పరిహారం..
- తడిసిన ధాన్యం, మక్కజొన్నలు కొనుగోలు చేస్తాం..



**ముద్ర న్యూస్, ధర్మారం:** ఇసుక దందాలో తాను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో కురిసిన ఆకాల వర్షాలకు జరిగిన నష్టాన్ని మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తనపై ఏలాంటి ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వకాలంలో జోరుగా ఇసుక దందాసాగిందని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరేళ్ల గ్రామం నుంచి మానేరు ఇసుకను రోజు వందల లారీల్లో రవాణ చేసే వారని మంత్రి అన్నారు. అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న క్రమంలో పలువురు లారీల కింద పడి మరణించారని మంత్రి అడ్లూరి గుర్తు చేశారు. నేరేళ్ల దళితులు అక్రమ ఇసుక రవాణపై అందోళన చేస్తే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులపై థర్డ డిగ్రీ ఉపయోగించిందని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో దళితులపై జరిగిన దాడులపై మాట్లాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మపురి నియోజకవర్గంలో ఇసుక దందాలో తనకు వాట ఉందని మాట్లాడుతున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. ఇసుక దందాలో తాను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజీనామా చేయడానికి సిద్దమని మంత్రి అడ్లూరి అన్నారు. మాజీ మంత్రి కొప్పుల నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని మంత్రి అడ్లూరి హితవు పిలికారు.

### తడిసినవడ్లు, మొక్కజొన్నలు కొనుగోలు చేస్తాం..

ధర్మరం మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యం, మక్కజోన్నలు కొనుగోలు చేస్తామని మంత్రి అడ్లూరి అన్నారు. రైతులు ఎవ్వరు అందోళన చెందవద్దని మంత్రి కోరారు. ఆకాల వర్షానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ పరంగా అదుకుంటామని మంత్రి అడ్లూరి తెలిపారు.

## పుష్కర స్నానమాచరించిన మంత్రి వివేక్ ఎంపీ వంశీకృష్ణ



**మహదేవపూర్, ముద్ర:** రాష్ట్రమైనింగ్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ఎంపి గడ్డం వంశీకృష్ణ తో కలిసి గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించారం. రాష్ట్ర ప్రభుత్వం గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు సుమారు రూ. 1000 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి వివేక్ వెంకట స్వామి వెల్లడించారు. గోదావరి ప్రవహిస్తున్న జిల్లాల్లో కూడా పుష్కరాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు కాళేశ్వరం దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. దేవాలయం అభివృద్ధి పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసారని తెలిపారు. అలాగే బాసర దేవాలయ అభివృద్ధికి 170 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రహదారుల అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదలపై దృష్టి సారించామని, గోదావరి పుష్కరాల ప్రారంభానికి ముందే అన్ని పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మొదటి విడత నిధులు ఇప్పటికే విడుదల చేసినట్లు వెల్లడించారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఎంతో పవిత్రమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు దేవుని ఆశీస్సులు అందరికీ లభించాలని కోరారు. ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సరస్వతి మాతా, శ్రీ.కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆశీర్వాదంతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని కోరుతూ, పుష్కరాలు విజయవంతంగా నిర్వహించడంపట్ల హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యలు పరిష్కారం ద్వారా అధిక స్థానాల్లో గెలవాలి

- బి వి రాఘవులు




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం** : గతంలో ఖమ్మం నగరంలో సమర్ధవంతమైన పాలన అందించిన ఘనత సిపిఎం పార్టీకి వుంది అని, ప్రజలకు మరింత చేరువగా వుండటం ద్వారా వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో పార్టీ గెలవడానికి చాలా అవకాశాలు ఉన్నాయని సిపిఎం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు తెలిపారు. సోమవారం సుందరయ్య భవనంలో జరిగిన పార్టీ ఖమ్మం డివిజన్ వర్క్ షాప్ జిల్లా కమిటీ సభ్యులు భుక్యా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బివి రాఘవులు హాజరు పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఛైర్మన్ గా చిర్రావూరి లక్ష్మి నర్సయ్య, సమీనా అఫ్రోజ్ చిత్తశుద్ధితో నిజాయితీగా, అత్యంత సమర్ధవంతంగా పరిపాలన చేశారని వివరించారు. భవిష్యత్ ఖమ్మం నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆనాడే త్రాగు నీరు సౌకర్యం, విశాలంగా రహదారులు, తదితర మౌలిక సదుపాయాలు ఆ కాలంలోనే ప్రజల అవసరాలకు తగ్గట్టుగా కల్పించారని తెలిపారు. నేడు ఖమ్మం నగరంలో ఏ సమస్యలు వచ్చినా ప్రజల వైపు నిలబడి నిత్యం ఆందోళనలు చేయడం ద్వారా మరింతగా ప్రజలకు సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి సిపిఎం ఒక కారణం అని తెలిపారు. ప్రజలతో మరింతా మమేకమై ప్రజా సమస్యలు పరిష్కారం ద్వారా రాబోయే ఎన్నికల్లో అధిక స్థానాల్లో కార్పొరేటర్లు గెలవడానికి తగిన ప్రణాళిక చేసుకోవాలి అని సూచించారు. రాబోయే కాలంలో మోడీ వ్యతిరేకంగా ప్రజా ఆందోళనలు విస్తృతంగా చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనువాసరావు, నాయకులు బండారు రమేష్, దొంగల తిరుపతిరావు, జబ్బర్, ఎస్ నవీన్ రెడ్డి, SK మీరా సాహిబ్, పి రమ్య, బోడపట్ల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ముగిసిన సరస్వతి అంత్య పుష్కరాలు

- కాళేశ్వరంలో భక్తుల పోటెత్తిన రద్దీ

**మహాదేవపూర్, ముద్ర:** సరస్వతి అంత్య పుష్కరాల చివరి రోజైన సోమవారం కాళేశ్వరం క్షేత్రంలో భక్తులు భారీగా తరలివచ్చారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి, శ్రీ కాళేశ్వర–ముక్తీశ్వర స్వామివారిని దర్శించుకుని ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. 11 రోజుల పాటు లక్షలాది మంది భక్తులు పుష్కరాల్లో పాల్గొనగా, గోదావరి హారతులు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.భక్తుల సౌకర్యార్థం అధికారులు చలువ పందిళ్లు, విశ్రాంతి కేంద్రాలు, మంచినీటి వసతులు, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ముగింపు వేడుకలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై సరస్వతి నదీమాతకు శాస్త్రోక్తంగా చీరెసారె సమర్పించి ఉద్వాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి శ్రీధర్ బాబు దంపతులు, అధికారులు చేసిన కృషితో సరస్వతి అంత్య పుష్కరాలు విజయవంతంగా ముగిశాయని భక్తులు, స్వామీజీలు ప్రశంసించారు. నేటితో పుష్కరుడు యమునా నదికి ప్రవేశించనున్నాడు. సరస్వతి అంత్య పుష్కరాలు ముగింపు వేడుకల్లో రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ఎస్సి, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, భూపాలపల్లి, రామగుండం శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, సర్పంచ్ మోహన్ రెడ్డి, మోహన్ శర్మ, గ్రంథాలయ చైర్మన్ రాజబాబు, దేవాలయ ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచి పెరిగిన కనీస వేతనాలు



- 1.11 కోట్ల మందికి వేతనాల లబ్ధి
- హైస్కిల్డ్‌కు రూ.20 వేల కనీస జీతం
- 77 రంగాలకు కొత్త వేతన విధానం
- తక్కువ జీతాలపై కఠిన చర్యలు

**ముద్ర డెస్క్ :** తెలంగాణలో నేటి నుంచి కొత్త కనీస వేతనాలు అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 1.11 కోట్ల మంది కార్మికులు, వేతన జీవులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కనీస వేతనాలను సవరించింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో కనీస వేతనాల పెంపు జరగడం విశేషంగా మారింది.

కొత్త విధానంలో రాష్ట్రాన్ని మూడు జోన్లుగా, ఉద్యోగులను నాలుగు నైపుణ్య కేటగిరీలుగా విభజించారు. మున్సిపల్ కార్పొరేషన్లు జోన్–1, మున్సిపాలిటీలు జోన్–2, గ్రామీణ ప్రాంతాలు జోన్–3గా గుర్తించారు. కొత్తగా హైస్కిల్డ్ కేటగిరీని ప్రవేశపెట్టిన ప్రభుత్వం, జోన్–1లో హైస్కిల్డ్ ఉద్యోగులకు కనీస వేతనాన్ని రూ.20 వేలుగా నిర్ణయించింది. అన్‌స్కిల్డ్ కార్మికులకు జోన్‌ను బట్టి రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు వేతనాలు ఖరారు చేసింది.

అదే సమయంలో ఈ–కామర్స్, కొరియర్ సేవలు, మొబైల్ టవర్ నిర్వహణ, కేబుల్ టీవీ నెట్‌వర్క్‌లు, ఎల్పీజీ పంపిణీ సంస్థలు తదితర 10 కొత్త రంగాలను కనీస వేతనాల చట్టం పరిధిలోకి తీసుకువచ్చింది. దీంతో చట్టం వర్తించే మొత్తం ఉపాధి రంగాల సంఖ్య 77కు పెరిగింది. రాష్ట్రంలోని ప్రైవేట్ కంపెనీలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఐటీ సంస్థలు, సెక్యూరిటీ ఏజెన్సీలు, షాపింగ్ మాల్స్ సహా అన్ని సంస్థలు ఈ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాల కంటే తక్కువ చెల్లిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు కార్మిక శాఖ స్పష్టం చేసింది.

# మళ్లీ భగ్గుమన్న హర్మూజ్

- అమెరికా-ఇరాన్ పరస్పర దాడులు
- ఖేష్మ్‌పై దాడులతో ఉద్రిక్తత
- ప్రతిదాడులతో భగ్గుమన్న పశ్చిమాసియా
- హర్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్త వాతావరణం

**ముద్ర డెస్క్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. శాంతి చర్చలు కొలిక్కి వస్తున్నాయనుకున్న సమయంలో అమెరికా, ఇరాన్ పరస్పర దాడులతో హర్మూజ్ జలసంధి ప్రాంతం మళ్లీ ఉద్రిక్తంగా మారింది. ఇరాన్‌లోని గురుక్ నగరం, ఖేష్మ్ ద్వీపంలోని సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు నిర్వహించాయి. తమ డ్రోన్‌ను కూల్చివేయడం, యుద్ధనౌకలకు ముప్పు పెరగడంతో ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే ఈ దాడులు చేపట్టినట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా దాడులకు ప్రతిగా తాము కూడా ఎదురుదాడులు చేసినట్లు ఇరాన్ ఐఆర్‌జీసీ వెల్లడించింది. కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. అయితే దాడి జరిగిన ఖచ్చితమైన ప్రాంతాన్ని వెల్లడించలేదు. హర్మూజ్ జలసంధిపై నియంత్రణలో ఖేష్మ్ ద్వీపానికి కీలక ప్రాధాన్యం ఉంది. అక్కడ ఇరాన్ భారీ సంఖ్యలో క్షిపణులు, డ్రోన్లు, స్పీడ్‌బోట్లను మోహరించి ఉంచింది. ప్రపంచ చమురు రవాణాలో కీలక మార్గమైన హర్మూజ్‌లో తాజా పరిణామాలు అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తున్నాయి.



# విద్వేషాలు సృష్టించేందుకు వైకాపా కుట్ర

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
పింఛన్ల పంపిణీలో కొత్త విధానం.. మూడు నెలల వరకు అవకాశం
ప్రతి కుటుంబానికి 3-4 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం
రాష్ట్రానికి భారీ పెట్టుబడులు.. యువతకు ఉద్యోగాలే లక్ష్యం
పేదల సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా కొనసాగిస్తున్నాం
వైకాపా తప్పడు ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఏపీ సీఎం చంద్రబాబు



**ముద్ర, కాకినాడ** : రాష్ట్రంలోని పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్య క్రమాలు అమలు చేస్తోందని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు తెలిపారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరంలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, గతంలో ఒక నెల పింఛన్ తీసుకోకపోతే రద్దు చేసేవారని, ప్రస్తుతం మూడు నెలల వరకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కుటుంబానికి మూడు నుంచి నాలుగు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. మహిళలకు రాజకీయాల్లో 33 శాతం ప్రాతినిధ్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, గ్యాస్ ధరలు పెరిగినా మహిళలకు ఉచితంగా మూడు సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు.రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకువచ్చామని, పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని యోగా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. పింఛన్లను ఇంటికే చేరవేస్తూ ప్రజలకు సౌకర్యం కల్పిస్తున్నామని, సమస్యలకు ఆన్‌లైన్ ద్వారా పరిష్కారాలు అందిస్తున్నామని వివరించారు.అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతిపక్ష వైకాపా అసత్య ప్రచారాలకు పాల్పడుతోందని చంద్రబాబు ఆరోపించారు. ప్రజలు తప్పుడు ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## పదవీ విరమణ వయసుకే గానీ.. మనసుకు కాదు

- డా. జి. రామేశ్వర్ రావు



**ముద్ర, హైదరాబాద్ :** ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ వయసు రీత్యా తప్పనిసరైనప్పటికీ, వ్యక్తి ఆరోగ్యం, ఆలోచనలు, మనసు చురుకుగా ఉన్నంతకాలం అతనికి నిజమైన రిటైర్మెంట్ ఉండదని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ESCI) డైరెక్టర్ డా. జి. రామేశ్వర్ రావు అన్నారు. కాలేజీలో మూడున్నర దశాబ్దాలుగా వివిధ హోదాల్లో సేవలందించిన జి. నాగ మల్లేశ్వర రావు పదవీ విరమణ సందర్భంగా సోమవారం నిర్వహించిన వీడ్కోలు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1990లో కేవలం 24 ఏళ్ల వయసులో క్యాడ్ ఆపరేటర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన నాగ మల్లేశ్వర రావు, సుమారు 35 ఏళ్ల సేవా కాలంలో క్యాడ్ ఇన్‌స్ట్రక్టర్, ప్రోగ్రాం అసిస్టెంట్, ప్రోగ్రాం సూపర్వైజర్, ప్రోగ్రాం ఆఫీసర్, అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్ హోదాల వరకు ఎదిగి సంస్థలో ప్రత్యేక గుర్తింపు పొందారని డా. రామేశ్వర్ రావు పేర్కొన్నారు. నేటి శాస్త్ర సాంకేతిక పురోగతితో మానవ జీవిత కాలం పెరిగిందని, అందువల్ల 60 ఏళ్ల వయసులో ఉద్యోగ విరమణ వచ్చినా, జీవితంలో కొత్త అధ్యాయానికి అది ప్రారంభమేనని అన్నారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, గచ్చిబౌలిలో మౌలిక సదుపాయాలు పరిమితంగా ఉన్న రోజుల నుంచి నేటి ఆధునిక కంప్యూటర్ యుగం వరకు సంస్థ అభివృద్ధిని దగ్గరగా చూసిన నాగ మల్లేశ్వర రావు తన నిజాయితీ, నిబద్ధత, ప్రశాంత స్వభావంతో అందరి మన్ననలు పొందారని కొనియాడారు. విధుల్లో ఎలాంటి ఒత్తిడులు ఎదురైనా సమతుల్యంగా వ్యవహరిస్తూ సహచరులకు మార్గనిర్దేశం చేసేవారని తెలిపారు.పదవీ విరమణ పొందిన నాగ మల్లేశ్వర రావు మాట్లాడుతూ, ప్రశాంతంగా ఆలోచిస్తే ఎలాంటి క్లిష్ట సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందని తన 35 ఏళ్ల ఉద్యోగ అనుభవం నేర్పిందన్నారు. ఉద్యోగ జీవితంలో ఎదురైన సవాళ్లను అధిగమించడంలో ఉన్నతాధికారులు, సహోద్యోగుల సహకారం ఎంతో దోహదపడిందని చెప్పారు. అంతర్జాతీయ శిక్షణా సంస్థగా ESCIలో వివిధ ప్రాంతాలు, భాషలు, సంస్కృతుల నుంచి వచ్చిన వారితో పనిచేసిన అనుభవం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో కాలేజ్ చీఫ్ ఎస్. లక్ష్మీకాంతరావు, డిప్యూటీ చీఫ్ డా. పి. రాజారావు, అనితా అగర్వాల్, డా. చంద్రకళ, సాయి కిషోర్, డా. నరేష్, సుధాకర్, నాగేశ్వరరావు, పద్మ, కవితతో పాటు నాగ మల్లేశ్వర రావు కుటుంబ సభ్యులు పాల్గొని ఆయన సేవలను స్మరించారు.

సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
మంగళవారం, 02.06.2026

www.mudranews.in | @mudranews

3


సంపుటి:13 సంచిక: 221
పేజీలు: 08 వెల: రూ. 5

## తప్పు నేతలది..
# శిక్ష అధికారులకు!
### అధికారుల తప్పటడుగులు

- పోలీస్, రెవిన్యూ శాఖ పై తీవ్ర ప్రభావం
- ఇసుక దందాకు అండదండలు
- వినకపోతే బదిలీ వేటు
- ఇసుక ఉన్న నియోజకవర్గాల్లో రూ. కోట్ల లో దందా..
- కోయిల కొండ వాగులో జోరుగా ఇసుక దందా
- నెలకు రూ.లక్షల్లో మామూళ్లు
- కోయిల కొండ మండలం లో ఏడాదిలో ఇద్దరూ ఎస్ ఐల బదిలీలు

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**
ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతల ఇసుక దందాకు పోలీస్, రెవిన్యూ అధికారులు బలవుతున్నారు. నేతలు చేసిన తప్పులకు అధికారులు శిక్షకు గురువుతున్నారు. జిల్లాలో నేతల ఇసుక దందా జోరుగా సాగుతోందని ప్రజలు ఆరోపిస్తు న్నారు.. నారాయణ పేట నియోజకవర్గంలో కోయిల కొండ పెద్ద వాగు, దేవరకద్ర నియోజకవర్గంలోని ఊకచెట్టి వాగు, మూసాపేట్, మిడ్జిల్, భూత్పూర్, హన్వాడ మండలాల్లోని వాగుల్లో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. ఇటీవలే పాలమూరు సమీపంలో డంప్ చేసిన ఇసుకను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సీజ్ చేశారు. ఈ ఇసుక విలువ రూ.రెండు కోట్లు ఉంటుందని అధికారులు ప్రకటించారు. పాలమూరు సమీపంలో బాహాటంగా ఇసుక డంప్ చేయడం వెనుక ఇసుక మాఫియాకు ఎంత మద్దతు ఉందో ఇట్టే అర్థం అవుతోంది. ఇటీవల దేవరకద్ర నియోజకవర్గంలో ఇసుక మాఫియా మరీ బరితెగించి ఏకంగా రాత్రి సమయంలో నీటితో నిండుగా ఉన్న చెక్ డ్యామ్ ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. ఓ రైతు అడ్డుకోవడంతో ఇసుక మాఫియా ఆ మిగతా 05లో





## రైతు డిస్కమ్..
# సంస్కరణా సంకటమా?
### 29 లక్షల వ్యవసాయ కనెక్షన్లు కొత్త సంస్థ పరిధిలోకి

- ఉచిత విద్యుత్‌కు ముప్పా?
- రూ.72 వేల కోట్ల భారంతో కొత్త డిస్కమ్
- రైతుల కోసం ప్రత్యేక విద్యుత్ సంస్థ
- రేవంత్ సర్కార్ కొత్త ప్రయోగం
- రైతు డిస్కమ్‌పై రాజకీయ రగడ
- మీటర్లకు దారి తీస్తుందా?
- విద్యుత్ రంగంలో భారీ మార్పులు
- రైతులకు లాభమా.. నష్టమా?
- తెలంగాణలో మూడో డిస్కమ్

**ముద్ర డెస్క్ :**
తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా రైతు డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (రైతు డిస్కమ్) ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలో తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రస్తుతం పనిచేస్తున్న రెండు డిస్కమ్‌ల నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరా బాధ్యతలను వేరు చేసి కొత్త సంస్థకు అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్రంలోని 29 లక్షలకుపైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లక్షలాది ట్రాన్స్‌ఫార్మర్లు, కాళేశ్వరం వంటి ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులకు విద్యుత్ సరఫరా బాధ్యతలు దీని పరిధిలోకి వస్తాయి. వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా కారణంగా డిస్కమ్‌లపై భారీ ఆర్థిక భారం పడుతోందని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం రెండు డిస్కమ్‌లపై పేరుకుపోయిన నష్టాలు దాదాపు రూ.60 వేల కోట్లకు చేరగా, కొత్త రైతు డిస్కమ్‌కు బదిలీ కానున్న అప్పులు, బకాయిలు, ఇతర బాధ్యతలు కలిపి దాదాపు రూ.72 వేల కోట్ల మేర ఉండనున్నాయి.
వ్యవసాయ విద్యుత్ వ్యవస్థను ప్రత్యేకంగా నిర్వహించడం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ అంతరాయాల పరిష్కారం మరింత వేగంగా జరుగుతాయని ప్రభుత్వం పేర్కొంటోంది. అలాగే ప్రస్తుతం ఉన్న డిస్కమ్‌లపై ఆర్థిక భారాన్ని తగ్గించడం ద్వారా వాటి పనితీరు మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఉచిత విద్యుత్ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నంలో భాగంగానే రైతు డిస్కమ్‌ను తీసుకొస్తున్నారని ఆరోపిస్తున్నాయి. భవిష్యత్తులో వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసే అవకాశాలు పెరుగుతాయని, రైతులపై అదనపు భారం పడే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. మిగతా 05లో


## బండి కోసం
# సైకిల్ యాత్ర
### పెరుగు వెంకటేశ్వర్లు సాహసం



- తిరుపతి నుంచి హైదరాబాద్ కు 680 కి.మీల ప్రయాణం
- హైదరాబాద్ లో బండి సంజయ్ నివాసానికి
- ఆతిథ్యం ఇచ్చి యాత్ర విశేషాలు తెలుసుకున్న కేంద్ర మంత్రి

04

# అభివృద్ధి, సంక్షేమం పరుగు
### మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలకు భారీ నిధులు



- హైదరాబాద్ జలమండలికి రూ.75 కోట్ల
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూ.414 కోట్లు
- ఆర్థిక శాఖ కీలక నిర్ణయాలు

05

# ఇదేం దారుణం
### గవర్నర్ కాన్వాయ్ కోసం ట్రాఫిక్ నిలిపివేత?

- గర్భిణితో చిక్కుకున్న వ్యక్తి రోడ్డుపై నిరసన..
- బెంగళూరులో వైరల్ వీడియో
- వీఐపీ సంస్కృతిపై మండిపాటు

04



గవర్నర్ కాన్వాయ్ కోసం పోలీసులు దాదాపు అరగంట పాటు ట్రాఫిక్‌ను నిలిపివేయడంతో.. అత్యవసర పరిస్థితిలో ఉన్న ఓ గర్భిణి భర్త నడిరోడ్డుపై కూర్చొని నిరసనకు దిగిన ఘటన కర్ణాటకలో కలకలం రేపింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో 'వీఐపీ కల్చర్'పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. రంగంలోకి దిగిన బెంగళూరు పోలీసులు ఈ ఘటనపై అధికారిక విచారణకు ఆదేశించారు.

-ముద్ర డెస్క్ :

# కాంగ్రెస్ సర్కార్ విఫలం
### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



- ఎంత పంట పడిందనే సమాచారం కేంద్రానికి ఇవ్వలేదు
- రైస్ మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కు
- నేడు ఢిల్లీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

04

# గిల్లికజ్జాలు
### అసలు వ్యూహం ఏంటి?

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
దశాబ్ద ఆవిర్భావం వేళ తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ సెంటిమెంట్ తెరపైకి వస్తోంది. పదేళ్ల రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇప్పుడిప్పుడే పరిపాలన, అభివృద్ధి అంశాలపై మిగతా 05లో



- తెలంగాణ గడ్డపై మళ్లీ సెంటిమెంట్
- పవన్ వేదికగా మారుతున్న రాజకీయాలు
- ఆజ్యం పోస్తున్న బీఆర్ఎస్..
- పంజా విసురుతున్న పవన్
- సైలెంట్ మోడ్ లో రేవంత్
- భగ్గమంటున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

# పంట మార్పిడి చేయాలి
### రైతులకు అవగాహన కల్పించాలి

- ఈసారి వానలు అంతంతే
- ఎల్ నినో ఉంటుందని సమాచారం
- తక్కువ నీటి వనరు పంటలకే ప్రాధాన్యం
- వర్షా కాల సన్నద్ధతపై అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

05



## ఇసుక దందా ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా



రాష్ట్ర సంక్షేమశాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ 02

## విద్వేషాలు సృష్టించేందుకు
# వైకాపా కుట్ర
### పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: చంద్రబాబు

- పింఛన్ల పంపిణీలో కొత్త విధానం..
- ప్రతి కుటుంబానికి 3-4 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం
- రాష్ట్రానికి భారీ పెట్టుబడులు.. యువతకు ఉద్యోగాలే లక్ష్యం
- పేదల సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా కొనసాగిస్తున్నాం
- అప్రమత్తంగా ఉండాలి

02




# ఆపరేషన్ 'డిపార్ట్'
### బెంగాల్ లో అక్రమ వలసదారుల ఏరివేత ప్రారంభం

- అక్రమవలసదారులపై సర్కార్ సీరియస్
- డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్ విధానానికి శ్రీకారం
- అక్రమ వలసదారుల ఎరివేత షురూ
- జైళ్లలో ఉంచి పోషించలేం.. స్వదేశానికివెళ్లిపోండి
- బంగ్లాదేశీయులకు సీఎం సువేందు స్ట్రాంగ్ వార్నింగ్
- ప్రాణభయంలో సరిహద్దులకు బంగ్లా ప్రజల ఉరుకులు

05



ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 02.06.2026
www.mudranews.in | @mudranews



## ఆవకాయతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది



పచ్చి మామిడికాయల్లో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి రోగనిరోధక శక్తిని అందించి, సీజనల్ వ్యాధుల బారి నుండి కాపాడతాయి.

## బీఆర్ఎస్ తెలుగు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతోంది

**పవన్ కల్యాణ్.. తెలంగాణలో సభ పెట్టుకోవచ్చు**
**తెలంగాణను కించపరిస్తే మాత్రం ఊరుకోం**
**ఫోన్ ట్యాపింగ్ నిందితులను శిక్షించాల్సిందే**
**ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లు అయినా బీఆర్ఎస్ తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలను రెచ్చగొడుతోందని ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణలో సభ పెట్టుకోవచ్చని, కానీ తెలంగాణను కించపరిస్తే ఊరుకోబోమన్నారు. గతంలో కేసీఆర్, వైఎస్ జగన్‌తో కలిసి పనిచేశారని, ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లో కూడా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**ఫోన్ ట్యాపింగ్ నిందితులకు శిక్ష తప్పదు**

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బాధ్యులెవ్వరైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని యెన్నెం అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో కలిసి విచారణ అధికారుల ఎదుట హాజరై తమ వాదనలు వినిపించినట్లు తెలిపారు. గత ఎన్నికల సమయంలో తనతో పాటు కుటుంబ సభ్యులు, జర్నలిస్టులు, రాజకీయ ప్రత్యర్థుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా జరిగిన ఈ వ్యవహారంలో దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూన్‌లో చార్జ్‌షీట్ దాఖలు అవుతుందని అధికారులు తెలిపినట్లు వెల్లడించారు.

## ఏఐసిసి చీఫ్ తో డిప్యూటీ సీఎం భట్టి భేటీ

**జార్ఖండ్ రాజకీయ పరిణామాలపై ఏఐసీసీ అధినేతకు నివేదిక**

ముద్ర న్యూస్ , న్యూ ఢిల్లీ : ఢిల్లీ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం అక్కడి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఇటీవల జార్ఖండ్ పర్యటనకు వెళ్లిన భట్టి... అక్కడ తాను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు, తాజా రాజకీయ పరిణామాలను ఈ సందర్భంగా ఖర్గేకు నివేదించారు. జార్ఖండ్‌లో త్వరలో జరగబోయే రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో.. ఆ రాష్ట్ర సీఎం హేమంత్ సోరెన్‌తో తాను జరిపిన చర్చల వివరాలను ఏఐసీసీ అధినేతకు వివరించారు. రాజ్యసభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి, ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించడానికి జరుగుతున్న ప్రయత్నాలను ఆయన ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యసభ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగడంపై జార్ఖండ్ స్థానిక నాయకత్వంతో జరిపిన సంప్రదింపులను భట్టి విక్రమార్క ఈ సందర్భంగా ప్రస్తావించారు. కూటమి ఐక్యతను చాటేలా జార్ఖండ్ కాంగ్రెస్ నేతలు శ్రమిస్తున్న తీరును ఆయన ఏఐసీసీ అధ్యక్షునికి వివరించారు.

## ధాన్యం సేకరణలో తెలంగాణకు రికార్డు ఫలితాలు



**ముద్ర, తిరుమలగిరి (సూర్యాపేట)** : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు చెప్పారు. ఇప్పటికే 9.31 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.11,500 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్నీ కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జూన్ తొలి వారం నాటికి మిగిలిన కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించిన మంత్రి, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.

## తెలంగాణ అస్తిత్వంపై దాడులను సహించబోం

**తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు - సాధన రౌండ్ టేబుల్ సమావేశం లో టీఆర్ఎస్ చీఫ్ కవిత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర అస్తిత్వం, హక్కులపై ఎలాంటి దాడులనైనా సహించబోమని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లో జరిగిన "ఉద్యమకారుల ఆకాంక్షలు – సాధన" రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలకు ఆంధ్రా ప్రజలతో ఎలాంటి విభేదాలు లేవని, అయితే ఆంధ్రా రాజకీయ నాయకుల జోక్యాన్నే వ్యతిరేకిస్తున్నామని అన్నారు. తెలంగాణలో ఆంధ్రా నాయకుల విగ్రహాల ఏర్పాటును అస్తిత్వంపై దాడిగా అభివర్ణిస్తూ, తమ పార్టీ అధికారంలోకి వస్తే వాటిని తొలగిస్తామని హెచ్చరించారు. అలాగే ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలని, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.




# 'బండి' కోసం మండు టెండలో 'సైకిల్ యాత్ర'

**- బండి సంజయ్ కు మంచి జరగాలని కోరుతూ పెరుగు వెంకటేశ్వర్లు జాతీయవాది సైకిల్ యాత్ర**
**- తిరుపతి నుండి హైదరాబాద్ దాకా 680 కి.మీల సైకిల్ యాత్ర**

**ముద్ర, కరీంనగర్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను రాజకీయంగా దెబ్బతీసేందుకు జరుగుతున్న కుట్రల నుండి కాపాడటంతోపాటు ఆయనకు మానసిక ప్రశాంతత కల్పించాలని కోరుతూ తిరుపతికి చెందిన 46 ఏళ్ల జాతీయ వాది పెరుగు వెంకటేశ్వర్లు ''సైకిల్ యాత్ర'' చేపట్టారు. తిరుపతి అలిపిరి వద్ద గంగమ్మకు మొక్కులు చెల్లించుకుని ''శక్తి సంకల్ప యాత్ర'' పేరుతో గత నెల 25న సైకిల్ యాత్ర ప్రారంభించారు. తిరుపతి మీదుగా మొదలైన సైకిల్ యాత్ర ఒంటిమిట్ట, కడప, నంద్యాల, మైదుకూరు, కర్నూలు మీదుగా తెలంగాణలో అడుగుపెట్టారు. అలంపూర్ మీదుగా పెబ్బేరు, జడ్చర్ల, బాలానగర్, షాద్ నగర్, శంషాబాద్ మీదుగా హైదరాబాద్ చేరుకున్నారు. ప్రతిరోజు సగటున 85 కి.మీల చొప్పున సైకిల్ తొక్కుకుంటూ ఈరోజు హైదరాబాద్ కు చేరుకున్నారు. వాస్తవానికి తిరుపతి నుండి కరీంనగర్




వరకు ''శక్తి సంకల్ప యాత్ర'' చేపట్టిన పెరుగు వెంకటేశ్వర్లు... బండి సంజయ్ కుమార్ హైదరాబాద్ లోనే ఉన్నారని సమాచారం రావడంతో నేరుగా బంజారాహిల్స్ లోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసానికి చేరుకున్నారు.

పెరుగు వెంకటేశ్వర్లు సైకిల్ యాత్ర గురించి బీజేపీ కార్యకర్తల నుండి సమాచారం అందుకున్న బండి సంజయ్ పెరుగు వెంకటేశ్వర్లును తన నివాసానికి సాదరంగా ఆహ్వానించారు. తాను జాతీయ వాదినని, జాతీయ వాదులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండాలనే సంకల్పంతో ఈ యాత్ర చేపట్టానని ఈ సందర్భంగా పెరుగు వెంకటేశ్వర్లు సంజయ్ కు తెలిపారు. మండుటెండను లెక్క చేయకుండా జాతీయ వాదులకు అండగా నిలుస్తూ పెరుగు వెంకటేశ్వర్లు చేస్తున్న ''శక్తి సంకల్ప యాత్ర'' అభినందనీయమన్నారు. అనంతరం పెరుగు వెంకటేశ్వర్లును శాలువాతో సన్మానించడంతోపాటు భోజన ఆతిథ్యమిచ్చారు.

ఈ సందర్భంగా పెరుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం, హిందుత్వం కోసం జాతీయవాది బండి సంజయ్ చేస్తున్న పోరాటాన్ని చూసి ఆయన అభిమానిగా మారాననన్నారు. ఇటీవల కాలంలో బండి సంజయ్ పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని చూసి తీవ్ర కలత చెందానని వాపోయారు. బండి సంజయ్ లాంటి జాతీయ వాది ఈ దేశానికి ఎంతో అవసరమని, అందుకే బండి సంజయ్ బాగుండాలని ఆయనకు జాతీయ వాదులంతా అండగా నిలవాలని కోరుతూ ''శక్తి సంకల్ప యాత్ర'' పేరుతో తిరుపతి నుండి హైదరాబాద్ వరకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. సైకిల్ యాత్రలో భాగంగా ప్రతిరోజు రాత్రి దేవాలయంలో బస చేసేవాడనని, మరుసటి రోజు ఆలయంలో బండి సంజయ్ బాగుండాలని పూజ చేసిన అనంతరం సైకిల్ యాత్ర చేసేవాడనని చెప్పుకొచ్చారు.

## ఇదేం దారుణం..

**గవర్నర్ కాన్వాయ్ కోసం ట్రాఫిక్ నిలిపివేత?**
**గర్భిణితో చిక్కుకున్న వ్యక్తి రోడ్డుపై నిరసన..**
**వీఐపీ సంస్కృతిపై మండిపాటు**



**ముద్ర డెస్క్** : బెంగళూరులోని ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్డుపై గవర్నర్ కాన్వాయ్ ప్రయాణానికి మార్గం కల్పించేందుకు దాదాపు 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌ను నిలిపివేశారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ఇప్పటికే అండర్‌పాస్ నిర్మాణ పనుల కారణంగా రద్దీగా ఉన్న ఈ మార్గంలో వందలాది మంది ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు విచారణకు ఆదేశించారు.సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో @Prajvalprince అనే ఖాతా నుంచి పోస్టు చేసిన వీడియోలో ఓ వ్యక్తి తన గర్భిణి భార్యతో కలిసి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయినట్లు కనిపించాడు. గవర్నర్ ఇంకా హెచ్‌ఏఎల్ విమానాశ్రయం నుంచి బయలుదేరకముందే వాహనాలను నిలిపివేశారని ఆరోపిస్తూ, అతను ఐఎస్‌ఆర్‌వో జంక్షన్ సమీపంలోని జీబ్రా క్రాసింగ్‌పై కూర్చొని నిరసన వ్యక్తం చేశాడు.వీడియోలో ఆ వ్యక్తి ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. తన భార్య గర్భిణి అని, అత్యవసర పరిస్థితిలో ఉన్నప్పటికీ వాహనాలను అనవసరంగా నిలిపివేశారని అతను ఆగ్రహం వ్యక్తం చేశాడు. అనంతరం ట్రాఫిక్ పోలీసులు హోయసళా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతను రోడ్డుపై నుంచి లేచి గవర్నర్ కాన్వాయ్‌కు మార్గం ఇచ్చాడు.ఈ ఘటన అనంతరం నెటిజన్లు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గర్భిణులు, రోగులు వంటి అత్యవసర అవసరాలున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో వీఐపీ భద్రత పేరుతో ప్రజలను ఇంతసేపు నిలిపివేయడం సరైందేనా అని ప్రశ్నించారు. ఇప్పటికే అండర్‌పాస్ నిర్మాణ పనుల కారణంగా రహదారి ఇరుకుగా మారిన పరిస్థితిలో సరైన ప్రత్యామ్నాయ ట్రాఫిక్ ఏర్పాట్లు చేయకపోవడంపై కూడా విమర్శలు వెల్లువెత్తాయి.అయితే, ట్రాఫిక్‌ను 30 నిమిషాల పాటు పూర్తిగా నిలిపివేసినట్లు వచ్చిన ఆరోపణలను పోలీసులు ఖండించారు. అంతసేపు వాహనాలను ఆపే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అయినప్పటికీ సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణలపై విచారణకు ఆదేశించినట్లు వెల్లడించారు.ఈ ఘటనపై స్పందించిన ఓ సీనియర్ పోలీసు అధికారి మాట్లాడుతూ, "వైరల్ వీడియోలో వచ్చిన ఆరోపణలపై విచారణ ప్రారంభించాం. జీవన్ భీమా నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. హెచ్‌ఏఎల్ ఎయిర్‌పోర్ట్ నుంచి నిరసన జరిగిన ప్రాంతం వరకు ఉన్న సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నాం. నిజంగా 30 నిమిషాల పాటు ట్రాఫిక్ నిలిపివేసినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. ఈ ఘటన మరోసారి దేశంలో వీఐపీ కల్చర్, ప్రజల సౌకర్యాల మధ్య సమతుల్యతపై చర్చకు తెరలేపింది. ప్రజల భద్రత, అత్యవసర అవసరాలను పక్కనబెట్టి వీఐపీ ప్రయాణాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు మరోసారి వినిపిస్తున్నాయి.

## కాంగ్రెస్ సర్కార్ విఫలం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**
**ఎంత పంట పడిందనే సమాచారం కేంద్రానికి ఇవ్వలేదు**
**రైస్ మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కు**
**నేడు ఢిల్లీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు**



**ముద్ర న్యూస్, న్యూ ఢిల్లీ :** ధాన్యం కొనుగోళ్లు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో ఎంత పంట పడిందనే సమాచారం కేంద్రానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతుల వద్ద ఉన్న పంటను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోవడంతోనే ధాన్యం కొనుగోళ్ల సమస్యలు వచ్చాయని విమర్శించారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రైస్ మిల్లర్లతో కుమ్మకైందని విమర్శించారు. చివరి గింజ వరకు ధాన్యం కొంటానని సీఎం చెప్పారని.. మరి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వడ్లను కేంద్రం ఎప్పుడు కొనదని.. ఆయా రాష్ట్రాలు కొన్న దానికి మాత్రమే రీయింబర్స్‌మెంట్ చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతోనే తెలంగాణలో ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ధాన్యం రోడ్లపై కుప్పలు కుప్పలుగా పడి ఉందని అన్నారు. బీజేపీ ఆందోళనతో రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చిందని తెలిపారు.ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ పోరాటంతోనే ఆయా కొనుగోలు కేంద్రాలకు లారీలను రేవంత్ ప్రభుత్వం పంపుతోందని చెప్పారు. తెలంగాణ నుంచి కేంద్ర కమిటీలోకి ఎవరు వెళ్తారనే విషయంపై కేంద్ర హైకమాండ్ ఓ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

**ఢిల్లీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తాం..**

నేడు ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని రాంచందర్‌రావు తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా బీజేపీ జాతీయ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. తెలంగాణ, కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే దిశగా తమ పార్టీ జాతీయ నాయకత్వం కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి సారించిందని అన్నారు. బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై పెట్టిన పోస్టర్లకు.. పార్టీలో గ్రూప్ తగాదాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీజేపీలో అంతర్గత కలహాలు సృష్టించాలనే ఈటలపై ఎవరో పోస్టర్లు పెట్టారని మండిపడ్డారు. పోస్టర్లు పెట్టిన వారిపై పార్టీ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ విషయంపై డీజీపీ, కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ పై సీఐడీ ఉక్కుపాదం

**అంతర్జాతీయ ముఠాల గుట్టురట్టు**
**ఆన్‌లైన్ బెట్టింగ్స్‌ను ప్రమోట్ చేస్తున్న సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు లాస్ట్ చాన్స్**
**కరీంనగర్ 'డాఫా బెట్' కేసు కొలిక్కి**
**ఢిల్లీ, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాల నుండి 11 మంది నిందితుల అరెస్ట్**
**మీడియాతో సీఐడీ చీఫ్ చారు సీన్హా**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో విస్తరిస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ నెట్‌వర్క్ పై ఉక్కుపాదం మోపుతామని సీఐడీ చీఫ్ చారు సీన్హా స్పష్టం చేశారు. సీఐడీకి బదిలీ అయిన ఆన్లైన్ బెట్టింగ్ కేసులపై సుదీర్ఘ విచారణ జరిపి అంతర్జాతీయ ముఠాల గుట్టురట్టు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం పర్యవేక్షణలో పని చేశామని చెప్పారు. సోమవారం హైదరాబాద్ లో ఆమె కేసు వివరాలు మీడియాకు వివరించారు. ఇది దేశవ్యాప్తంగా విస్తరించిన ఒక పెద్ద ఇంటర్నేషనల్ బెట్టింగ్ దందా అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్స్‌ను ప్రమోట్ చేస్తున్న సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ప్రస్తుతానికి ఒక్క ఛాన్స్ ఇస్తూ



కౌన్సిలింగ్ ఇచ్చినట్లు వివరించారు. మళ్లీ రిపీట్ అయితే మాత్రం కఠిన చర్యలు తప్పవని చారు సిన్హా హెచ్చరించారు.

**కరీంనగర్ 'డాఫా బెట్' కేసు ఛేదించిన సీఐడీ..**

కరీంనగర్‌లో నమోదైన ప్రముఖ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ 'డాఫా బెట్' కేసును సీఐడీ విజయవంతంగా ఛేదించింది. 40 మంది అధికారులతో కూడిన ప్రత్యేక బృందం 15 రోజుల పాటు దేశవ్యాప్తంగా జరిపిన మెరుపు ఆపరేషన్‌లో ఢిల్లీ, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాల నుండి 11 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈ బెట్టింగ్ నిర్వాహకులు అమాయకులను ఆకర్షిస్తూ రోజుకు రూ. 8 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు అక్రమంగా సంపాదిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులు లావాదేవీల కోసం ఉపయోగిస్తున్న 46 మ్యూల్ (ఇతరుల పేరుతో ఉన్న) బ్యాంక్ ఖాతాలను సీఐడీ అధికారులు సీజ్ చేశారు. ఈ ఒక్క డాఫా బెట్ యాప్‌పైనే దేశంలోని 8 రాష్ట్రాల్లో 225 ఫిర్యాదులు అందగా, 73 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. మరోవైపు తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సీఐడీ ఇప్పటివరకు 414 కేసులు నమోదు చేసింది. విచారణలో భాగంగా ప్రమాదకరమైన 108 ఆన్లైన్ బెట్టింగ్ అప్లికేషన్లను గుర్తించిన సీఐడీ, వాటిని పూర్తిగా నిషేధించాలని భారత ప్రభుత్వానికి (కేంద్ర ఐటీ శాఖకు) ప్రతిపాదనలు పంపింది.

**సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లకు కౌన్సిలింగ్..**

డబ్బుకు ఆశపడి ఆన్లైన్ బెట్టింగ్ యాప్లను, గేమ్స్‌ను ప్రమోట్ చేస్తున్న వారిపై సీఐడీ ప్రత్యేక నిఘా పెట్టింది. ఇందులో భాగంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్లను ప్రమోట్ చేసిన 25 మంది ప్రముఖ సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను పిలిపించి సీఐడీ అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇలాంటి చట్టవిరుద్ధమైన యాప్లను ప్రమోట్ చేయడం నేరమని స్పష్టం చేస్తూ, వారికి ఇదే చివరి అవకాశమని (ఒక్క ఛాన్స్) హెచ్చరించారు. భవిష్యత్తులో మళ్లీ బెట్టింగ్ యాప్ ప్రకటనల్లో కనిపిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐడీ చీఫ్ చారు సిన్హా స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 02.06.2026
www.mudranews.in | @mudranews



## ఆవకాయతో జీర్ణక్రియ మెరుగు



ఆవకాయలో వాడే ఆవపొడి, మెంతులు జీర్ణశక్తిని అద్భుతంగా పెంచుతాయి. ఇది కడుపుబ్బరం, గ్యాస్ వంటి సమస్యలను తగ్గించి తిన్న ఆహారం త్వరగా అరిగేలా చేస్తుంది.

# తప్పు నేతలది.. శిక్ష అధికారులకు!



(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నం విరమించుకుంది. ఈ విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. అంతకు ముందు కోయిల కొండ మండలం లోని సూరారం గ్రామం వద్ద భారీ ఇసుక డంప్ ను అధికారులు స్వాదీనం చేసుకున్నారు. అయినా ఇదే మండలం లోని ఆచార్య పూర్ గ్రామం వద్ద ఉన్న కోయిల్ సాగర్ ప్రాజెక్టు కు వెళ్లే వాగు నుంచి రాత్రి సమయంలో ఇసుక తరలింపు జోరుగా సాగింది. ఈ వాగు ఇసుకాసురులకు కాసుల వర్షం కురిపిస్తుంది. నారాయణ పేట నియోజకవర్గంలోనే ఈ వాగు చాలా పెద్దది. ఇసుక కూడా భారీ మొత్తం లో లభించడం తో మాఫియా దృష్టి అంతా ఇక్కడే ఉంటుంది. నారాయణ పేట ఓ నేత అండతో కోయిల కొండ రెవిన్యూ, పోలీస్ శాఖ ఇసుక తరలింపునకు కాపలాగా ఉంటున్నారు.

ఇక్కడి ఈ రెండు శాఖల అధికారులకు రోజుకు రూ. లక్ష మాముళ్లు వస్తాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ తహసీల్దార్, ఎస్ ఐ పోస్ట్ లకు మంచి డిమాండ్ ఉంటుంది. రూ. ఐదు లక్షలు ఇస్తేనే ఇక్కడ పోస్టింగ్ దొరుకుతుందని ఈ శాఖల అధికారులే అంటున్నారు.ఇంత డిమాండ్ పోస్ట్ కు ఉందంటే వాగుల్లో ఇసుక అధిక మొత్తంలో ఉండడమే అని స్వచ్ఛంద సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఈ విషయాన్ని వారు జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. నేత అండతో అధికారులపై కలెక్టర్ కూడా ఏ చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పని చేసే అధికారులకు రోజు పైసల పండుగే.గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ ఐ ఓ నేత చెప్పినట్లు ఇసుక దందా చేయలేదని ఉద్యోగంలో చేరిన ఐదు నెలల్లో బదిలీ చేయించారు. మళ్ళీ తనకు అనుకూలమైన ఎస్ ఐ ని తెచ్చుకున్నారు. ఇక్కడకు వచ్చిన ఎస్ ఐ నేత అండతో ఇసుక దందాలో అరితేరిపోయారు. ఏకంగా వాగు వద్ద రెగ్యులర్ గా ఒక కానిస్టేబుల్ ను డ్యూటీ లో ఉంచి ఇసుక వాహనాల తరలింపు లెక్కలు రాసే విధంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ రెవిన్యూ, పోలీస్ శాఖ ల పై ఎన్ని ఫిర్యాదు లు వచ్చినా జిల్లా అధికారులు డోంట్ కేర్ అనే విధంగా ఉన్నారు.

ఇక్కడ ఇసుక తరలింపు లో రూ. కోట్లు చేతులు మారుతున్నాయి. కోయిల కొండ ఎస్ ఐ, తహసీల్దార్ పై ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ కు కొన్ని వందల ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోలేదు. దీంతో మండల అధికారులు మరింత చెలరేగి పోయి వాగులన్నీ ఖాళీ చేయించారు. నేత అండ తో ఎస్ఐ ఆగడాలు మరింత ఎక్కువ కావడంతో ఆయన పై వచ్చిన ఫిర్యాదులకు విసిగి పోయిన జిల్లా పోలీస్ శాఖ ఎట్టకేలకు 2 రోజుల క్రితం బదిలీ వేటు వేసి అ ఎస్ఐని వీఆర్ పంపించారు. ఆరు నెలల్లో ఈ ఎస్ఐ బదిలీ కావడం ఇసుక తరలింపు లో విచ్చలవిడి తనగా ప్రవర్తించడమే అని అ శాఖ సిబ్బందే అంటున్నారు. ఏడాది లోగా ఇద్దరు ఎస్ ఐ లు బదిలీ కావడం తో కోయిల కొండ పోలీస్ స్టేషన్ లో ఇంకా ఎవరి పై వేటు పడుతుందో అని సిబ్బంది భయం భయం తో ఉన్నారు. ఈ మండలం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉండడం తో ఇక్కడ పనిచేసేందుకు అధికారులు అధిక శ్రద్ద చూపుతారు. ఎస్ఐ బదిలీ తరువాత తహసీల్దార్ పై వేటు పడే అవకాశం ఉంది.

ఇక్కడే కాదు ఉమ్మడి జిల్లాలో వాగు పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న రెవిన్యూ, పోలీస్ సిబ్బంది ఎవరి పై వేటు పడుతుందో అని నేతల వద్ద తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు. నేతలు చెప్పి నట్లు వినక పోతే ఒక తంట... వింటే మరో తంట అని ఆ శాఖల అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నేతలు చెప్పినట్లు విని పనులు చేస్తే తమ ఉద్యోగాలు పోతున్నాయని వాపోతున్నారు.నేతల కనుసన్నల్లో పని చేస్తేనే ఉద్యోగం ఉన్నట్లు.. లేకుంటే మారుమూల ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని దిక్కు తోచని స్థితిలో పనిచేస్తున్నామని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా అధికారు పార్టీ నేతలు చేస్తున్న తప్పులకు ఉద్యోగులకు శిక్ష తప్పడం లేదు. గత కెసిఆర్ ప్రభుత్వం నుంచే అధికారుల పై ఎమ్మెల్యే ల పెత్తనం పెరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చినా ఉద్యోగుల పై అధికార నేతల తీరులో ఎలాంటి మార్పు రాలేదని ఉద్యోగ సంఘాల నేతలు అంటున్నారు. మార్పు.. మార్పు అని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీఇంకా రెండున్నర ఏళ్ళలో ఏ మార్పు తీసుకొస్తుందో వేచిచూద్దాం.

# గిల్లికజ్జాలు..



(మొదటి పేజీ తరువాయి)

చర్చ జరుగుతుందనుకుంటున్న తరుణంలో, మళ్ళీ ఆంధ్ర–తెలంగాణ భావోద్వేగాలను రగిల్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ప్రస్తుతం సాగుతున్న సెంటిమెంట్ రాజకీయాల వెనుక ప్రధానంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగాలు క్రియాశీలకంగా కనిపిస్తున్నాయి. గతంలో కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాలను తెరపైకి తెచ్చి ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిల్చేందుకు ప్రయత్నించినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. అయితే, ఇప్పుడు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ టార్గెట్ గా జరుగుతున్న రాజకీయం, పవన్ కూడా తెలంగాణపై దృష్టి సారించడం, జూన్ 2న నిర్వహించబోయే సమావేశం వంటి పరిణామాలను ఆయుధంగా చేసుకుని తెలంగాణ ఆత్మగౌరవం పేరుతో కొత్త ఉద్యమాన్ని లేవనెత్తాలని బీఆర్ఎస్ భావిస్తోంది. తద్వారా కోల్పోయిన రాజకీయ ఉనికిని మళ్ళీ చాటుకోవాలన్నది ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది.

### కాంగ్రెస్ లోనూ భగ్గుమంటున్న రాజకీయం

కాంగ్రెస్ పార్టీలో కూడా ఈ సెంటిమెంట్ వేడి కనిపిస్తోంది. అనిరుధ్ రెడ్డి, మందుల సామ్యూల్ వంటి నేతలు ఏపీ నేతలను టార్గెట్ చేస్తూ చేస్తున్న వ్యాఖ్యలు పార్టీ లైన్‌కు భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వీరు కూడా ప్రాంతీయ నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ప్రాంతీయ సెంటిమెంట్ మళ్ళీ బలపడితే, ఆ సెంటిమెంట్‌కు పేటెంట్ హక్కు కలిగిన బీఆర్ఎస్‌కే అంతిమంగా లాభం చేకూరుతుందని రేవంత్ గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ఆయన భావోద్వేగాల కంటే బాధ్యతాయుతమైన పరిపాలనకే మొగ్గు చూపుతున్నారు.

### సెంటిమెంట్ రాజకీయాలకు దూరం

రేవంత్ రెడ్డికి ఒక స్పష్టమైన అవగాహన ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌ను ఎన్నుకున్నది కేవలం సెంటిమెంట్ కోసం కాదు, మార్పు, పరిపాలన కోసం. ఇప్పుడు మళ్ళీ అదే సెంటిమెంట్ ఉచ్చులో పడితే, కాంగ్రెస్ తన అభివృద్ధి అజెండాను పక్కన పెట్టాల్సి వస్తుంది. పైగా, ఏపీతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలని ఆయన భావిస్తున్నారు. కానీ, తన సొంత పార్టీ నేతలు కొందరు కంట్రోల్ కాకుండా ఏపీపై విమర్శలు చేయడం ఆయనకు తలనొప్పిగా మారింది. రేవంత్ రెడ్డి ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి డ్యూయల్ స్ట్రాటజీ అమలు చేసే అవకాశం ఉంది. ఒకటి, పార్టీ నేతలకు కఠినమైన ఆదేశాలు జారీ చేయడం ద్వారా ఏపీ నేతలపై అనవసర వ్యాఖ్యలు చేయకుండా అడ్డుకోవడం. రెండు, బీఆర్ఎస్ చేస్తున్న సెంటిమెంట్ ప్రచారాన్ని రాజకీయ డైవర్షన్ గా ప్రజల్లోకి తీసుకెళ్లడం. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేయని పనులను ఇప్పుడు సెంటిమెంట్ పేరుతో కప్పిపుచ్చుకోవాలని చూస్తోందని వాదించనున్నారు.

### పవన్ ను పావుగా వాడుతున్న రాజకీయం

పవన్ కళ్యాణ్ ఫ్యాక్టర్ కూడా ఈ సమీకరణాల్లో కీలకం. పవన్‌ను టార్గెట్ చేయడం ద్వారా సెంటిమెంట్‌ను పెంచాలని బీఆర్ఎస్ చూస్తుంటే, రేవంత్ మాత్రం దాన్ని కేవలం ఒక పొరుగు రాష్ట్ర నేత పర్యటనగా మాత్రమే పరిగణించాలనే ధోరణిలో ఉన్నారు. తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయాలు అనేవి ఒక డబుల్ ఎడ్జ్ స్వోర్డ్ లాంటివి. రేవంత్ రెడ్డి ఈ సెంటిమెంట్ వేవ్ ను సమర్థవంతంగా అడ్డుకోగలిగితేనే కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుంది. ఒకవేళ తన పార్టీ నేతలను కంట్రోల్ చేయడంలో విఫలమైతే, అది బీఆర్ఎస్‌కు ఆక్సిజన్ అందించినట్లు అవుతుంది.

### టార్గెట్ చేస్తున్న వారికి పవన్ షాక్

జనసేనాని పవన్ కళ్యాణ్ అడుగులు ఇప్పుడు సరికొత్త సమీకరణాలకు దారితీస్తున్నాయి. ఏపీలో అద్భుతమైన స్ట్రైక్ రేట్ తో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, పవన్ ఇప్పుడు తన దృష్టిని తెలంగాణపై కేంద్రీకరించడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జూన్ 2వ తేదీన హైదరాబాద్‌లో తన పార్టీ శ్రేణులతో జరిపే కీలక సమావేశం ద్వారా తెలంగాణలో జనసేన ఉనికిని చాటాలని ఆయన భావిస్తున్నారు.

### తెలంగాణపై పవన్ పంజా

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి విజయానికి వెన్నెముకగా నిలిచిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు తెలంగాణలో కూడా తన బలాన్ని నిరూపించుకోవాలని చూస్తున్నారు. ముఖ్యంగా తనపై వస్తున్న విమర్శలకు, తన పార్టీని టార్గెట్ చేస్తున్న వారికి జూన్ 2 సమావేశం వేదికగా గట్టి కౌంటర్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణలో జనసేన కేవలం నామమాత్రపు పార్టీ కాదని, నిర్ణయాత్మక శక్తిగా ఎదగడమే లక్ష్యంగా ఆయన అడుగులు వేస్తున్నారు. ఆయన త్రిశూల్ వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య త్రిముఖ పోరు నడుస్తోంది. ఇలాంటి సమయంలో జనసేన ఒంటరిగా లేదా వ్యూహాత్మకంగా పోటీ చేస్తే.. అదనంగా 4 నుంచి 5 శాతం ఓటింగ్ సాధించినా అది రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేస్తుంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ, ఏపీ సరిహద్దు జిల్లాల్లోనూ జనసేనకు బలమైన యువ ఓటు బ్యాంక్ ఉంది. ఈ 5 శాతం ఓట్లు ఎవరి ఖాతా నుంచి మళ్లుతాయి అనేదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న.

### మున్నూరు కాపులు అండగా ఉంటారా?

జనసేన పుంజుకుంటే అది ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓటు బ్యాంకును దెబ్బతీసే అవకాశం ఉంది. సెటిలర్ల ఓట్లు , యువత ఓట్లతో పాటు మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన ఓట్లు జనసేన వైపు మళ్లితే, స్వల్ప మెజారిటీతో గెలిచే స్థానాల్లో ఫలితాలు తలకిందులవుతాయి. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి బీజేపీకి ఓట్లు మళ్లుతున్న తరుణంలో, పవన్ కళ్యాణ్ ప్రవేశం కాంగ్రెస్‌కు కూడా సవాలుగా మారనుంది. పవన్ తన ప్రసంగాల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ,నిబద్ధత గురించి మాట్లాడుతుండటం అమితంగా ఆకర్షిస్తోంది.

### తెలంగాణ నేతలకు రోడ్ మ్యాప్

గతంలో తెలంగాణ ఎన్నికల్లో జనసేన పెద్దగా ప్రభావం చూపలేదు. కానీ, ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌కు పెరిగిన గ్రాఫ్ తెలంగాణలో కూడా ప్లస్ అవుతుందని పార్టీ భావిస్తోంది. జూన్ 2న జరిగే సమావేశంలో పవన్ తెలంగాణకు సంబంధించి ఎలాంటి రోడ్ మ్యాప్ ప్రకటిస్తారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా తనను టార్గెట్ చేస్తున్న రాజకీయ ప్రత్యర్థులకు ఆయన స్టైల్ లో ఇచ్చే సమాధానం ఎలా ఉంటుందోననే చర్చ సాగుతోంది. బీజేపీతో ఉన్న మిత్రధర్మాన్ని కొనసాగిస్తూనే, తెలంగాణలో జనసేన స్వతంత్రంగా ఎదగాలని పవన్ ఆశిస్తున్నారు. ఒకవేళ పొత్తులు కుదిరితే, అది బీజేపీకి అదనపు బలాన్ని ఇస్తుంది. ఒకవేళ ఒంటరిగా వెళ్తే, ఓట్లను చీల్చడం ద్వారా కింగ్ మేకర్ పాత్ర పోషించే అవకాశం ఉంది. ఏది ఏమైనా, తెలంగాణ రాజకీయాల్లో 5 శాతం ఓట్లు అనేవి ప్రభుత్వాలను కూల్చడానికి లేదా నిలబెట్టడానికి సరిపోతాయి. ఈ లెక్కనే ఇప్పుడు రాజకీయ పార్టీలను ఆందోళనకు గురిచేస్తోంది.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు భారీ బందోబస్తు..

**ముద్ర, హైదరాబాద్:**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి మల్కాజిగిరి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో మంగళవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఆయనతో పాటు దాదాపు 6 వేల మంది అతిథులు హాజరవుతున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా 1,140 మందితో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ముగ్గురు డీసీపీలు, నలుగురు అదనపు డీసీపీలు, 8 మంది ఏసీపీలు, 49 మంది ఇన్‌స్పెక్టర్లు, 88 మంది ఎస్సైలు, 723 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధుల్లో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే అతిథులు ఉదయం 7.30 గంటల్లోపే ప్రాంగణానికి చేరుకోవాలని మల్కాజిగిరి కమిషనర్ బి.సుమతి సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. పరేడ్‌గౌండ్స్‌లో మొత్తం 12 గేట్లు ఏర్పాటు చేశామని, కేటాయించిన పాస్‌ల ఆధారంగా అతిథులు నిర్దేశిత గేట్ల ద్వారా లోపలికి రావాలని సూచించారు. ఆహ్వానితులు కచ్చితంగా పాస్‌లు తీసుకురావాలన్నారు. పరేడ్‌గ్రౌండ్స్‌లో 55 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెట్టినట్లు వివరించారు. పరేడ్‌గ్రౌండ్స్ సమీప ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని కమిషనర్ పేర్కొన్నారు. బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో పారాగ్లైడర్లు, తేలికపాటి ఎయిర్‌క్రాఫ్టులు, ఆయుధాలు, పదునైన, మండే స్వభావమున్న వస్తువులు, డ్రోన్లు, లేజర్ లైట్లు తదితర వస్తువులపై నిషేధముందని వివరించారు. మంగళవారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు పరేడ్‌గ్రౌండ్స్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయన్నారు. బేగంపేట, సికింద్రాబాద్, తిరుమలగిరి, బోయిన్‌పల్లి, ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాల గుండా ప్రయాణించే వారు ప్రత్యామ్నాయం చూసుకోవాలని సూచించారు.

# రైతు డిస్కమ్.. సంస్కరణా? సంకటమా?

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు విద్యుత్ ఉద్యోగ సంఘాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారీ సంఖ్యలో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణకు ప్రతిపాదిత సిబ్బంది సరిపోరని పేర్కొంటున్నాయి. పరిశ్రమలు, వాణిజ్య వినియోగదారుల నుంచి వచ్చే ఆదాయం లేకుండా రైతు డిస్కమ్ ఆర్థికంగా నిలదొక్కుకోవడం కష్టమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఉచిత విద్యుత్ కొనసాగుతుందా? రూ.72 వేల కోట్ల భారం మధ్య కొత్త సంస్థ ఆర్థికంగా నిలబడగలదా? రైతులకు నిజంగా మెరుగైన సేవలు అందుతాయా? అనే ప్రశ్నలకు సమాధానాలు రానున్న రోజుల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం దీన్ని విద్యుత్ రంగ సంస్కరణగా చెబుతుండగా, ప్రతిపక్షాలు మాత్రం ఉచిత విద్యుత్‌కు ముప్పుగా అభివర్ణిస్తున్నాయి. దీంతో రైతు డిస్కమ్ అంశం తెలంగాణ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, రైతు సంక్షేమ విధానాల్లో కీలక చర్చగా మారింది.

# అభివృద్ధి, సంక్షేమం పరుగు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో ప్రజా మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తూ ఆర్థిక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులకు సోమవారం భారీగా నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీటిని అందించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత తాగునీటి పథకానికి ఊరట లభించింది. ఈ పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ కింద జలమండలికి రూ.75 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో నీటి సరఫరా వ్యవస్థ మరింత మెరుగుపడటంతో పాటు, బకాయిల చెల్లింపులకు మార్గం సుగమం కానుంది.

### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూ.414 కోట్లు

రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరయ్యాయి. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో నిర్మించ తలపెట్టిన ఈ పాఠశాలల భవన నిర్మాణ పనుల కోసం ఆర్థిక శాఖ రూ. 414 కోట్లు కేటాయించింది. అన్ని వర్గాల విద్యార్థులకు ఒకేచోట ఉత్తమ వసతులతో నాణ్యమైన విద్య అందించేందుకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.

# ఆపరేషన్ 'డిపోర్ట్'

**ముద్ర డెస్క్ :**

పశ్చిమ బెంగాల్‌లో అక్రమ వలసదారులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. 'డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్' విధానంతో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను గుర్తించి స్వదేశాలకు పంపించే ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు చెందిన అక్రమ వలసదారులపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తోంది.

ఈ సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారిని జైళ్లలో ఉంచి ప్రభుత్వ ఖజానాపై భారం మోపలేమని, స్వచ్ఛందంగా స్వదేశాలకు వెళ్లిపోవాలని హెచ్చరించారు. చట్టవిరుద్ధంగా భారత్‌లో ఉంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ప్రభుత్వం చేపట్టిన చర్యలతో సరిహద్దు ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. గుర్తింపు, నిర్బంధం, బహిష్కరణ చర్యలు వేగవంతం కావడంతో పలువురు అక్రమ వలసదారులు సరిహద్దుల వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర భద్రత, జనాభా సమతుల్యత దృష్ట్యా అక్రమ వలసలను అరికట్టడం అవసరమని ప్రభుత్వం పేర్కొంటోంది.

అక్రమ వలసదారుల గుర్తింపునకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించిన అధికారులు, పత్రాల పరిశీలనతో పాటు నివాస ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ చర్యలు రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా కొనసాగనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# పంట మార్పిడి చేయాలి

**ముద్ర డెస్క్ :**

ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులను పంట మార్పిడికి సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీరు వినియోగించే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.సోమవారం సచివాలయంలో వర్షాకాల సన్నద్ధతపై వ్యవసాయ, నీటిపారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాతావరణ శాఖ అధికారులు నైరుతి రుతుపవనాల ప్రభావం, వర్షపాతం అంచనాలు, ఎల్‌నినో పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు వెల్లడించారు.

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల వైవిధ్యత, పంట మార్పిడి ప్రాధాన్యాన్ని రైతులకు వివరించాలని సీఎం అధికారులకు సూచించారు. నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. అలాగే సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ పనులపై ఆరా తీసిన సీఎం, గేట్లు మరియు ఇతర మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సూచించారు. విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి, పశుసంపద నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అనివార్య పరిస్థితుల్లో నష్టం సంభవిస్తే తక్షణ స్పందనకు సిద్ధంగా ఉండేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సీఎం సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 02.06.2026
www.mudranews.in | @mudranews



## ఆవకాయతో రక్త ప్రసరణకు మేలు

దీనిలో వాడే వెల్లుల్లి, ఆవాలు గుండె ఆరోగ్యానికి మరియు రక్త ప్రసరణకు ఎంతో మంచివి. ఇవి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడతాయి.



# గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తాం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**- సరస్వతి పుష్కరాల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి**



**ముద్ర, కాళేశ్వరం:** వచ్చే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తామని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాదేవ్ పూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహిస్తున్న పవిత్ర సరస్వతి నది అంత్య పుష్కరాల సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ నది స్నానం ఆచరించి, అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా సరస్వతీ పుష్కరాలకు ఏర్పాట్లు చేసినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. ఇదే స్ఫూర్తితో వచ్చే గోదావరి పుష్కరాలు ఘనంగా నిర్వహిస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. కాళేశ్వరం క్షేత్రం ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైనదని, సరస్వతి అంత్య పుష్కరాలు భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగించే మహోత్సవమని పేర్కొన్నారు. శ్రీ ముక్తేశ్వర స్వామి వారి ఆశీస్సులు, సరస్వతి అమ్మవారి కరుణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. కష్టకాలంలో ఉన్నవారికి తాను ఇచ్చిన హామీలు వేరే విధంగా ఆశీర్వదించాలని భగవంతున్ని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అదికారులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన సుడా చైర్మన్



**ముద్ర, కరీంనగర్:** నగరంలోని కిసాన్ నగర్ 29 వ డివిజన్ లో సోమవారం సీసీ రోడ్డు పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సుడా రెండేళ్ల ప్రగతి పక్షోత్సవాలలో భాగంగా స్థానిక ప్రజల కోరిక మేరకు 15 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టామని నరేందర్ రెడ్డి అన్నారు. అంతర్గత రోడ్లు గుంతలమై ప్రజలు ఇబ్బందిపడుతున్న రోడ్లను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని అభివృద్ధి చేస్తున్నామని ఈ రెండేళ్లలో అనేక రోడ్లను అభివృద్ధి చేశామని రాబోయే రోజుల్లో ఇంకా అవసరమైన చోట తప్పకుండా అభివృద్ధి పనులు చేపడుతామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఏఈ సతీష్, సోమిడి వేణు ప్రసాద్, కాంపెల్లి కీర్తి కుమార్, కుర్ర పోచయ్య, తోట అంజయ్య, మంద మహేష్, మేరాజ్, అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాట్లు పూర్తి చేయాలి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా జగిత్యాల పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో గల అమరవీరుల స్తూపం వద్ద అన్నియ్య ఏర్పాటు పూర్తి చేయాలని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ఈ మేరకు అమరవీరుల స్థూపాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ సోమవారం సందర్శించి, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో భాగంగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించనున్న నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, పూల అలంకరణ, విద్యుత్ వెలుగులు ఇతర ఏర్పాట్లు, పట్టణ ముఖ్య కూడల్లలో కూడా విద్యుత్ వెలుగులు సమకూర్చాలని సంబంధిత మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అమరవీరులకు ఘనంగా నివాళులర్పించే విధంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్శనలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, కౌన్సిలర్లు ప్రశాంత్ రావు, జుంబర్తి గంగలక్ష్మి రాజ్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెరుగుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా క్రికెట్ ఆసోసియేషన్ నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని జగిత్యాల వివేకానంద మినీ స్టేడియంలో శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. క్రీడాకారుల కోసం జగిత్యాలలో క్రీడామైదానాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జగిత్యాల జిల్లా అసోసియేషన్ సెక్రటరీ దాడి జలపతి, కోశాధికారి రౌతు గంగారెడ్డి, నాయకులు బండ శంకర్, చెట్టే గంగాధర్, దయల శంకర్, కూసరి అనిల్, నక్కల రవీందర్ రెడ్డి, బాల ముకుందం, ముస్కు నారాయణ రెడ్డి, సుధాకర్ రావు, యం ఏ ఆరిఫ్, శశి, మనోహర్, ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

# సైకిల్ ర్యాలీలో అందరం పాల్గొందాం

**- కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ బాధ్యులు**




**ముద్ర, కరీంనగర్:** ఈ నెల 3న ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్,. ఏజే పెడల్స్ సంయుక్తంగా నిర్వహించే సైక్లింగ్ ర్యాలీలో ఔత్సాహిక సైక్లిస్టులు, సైక్లింగ్ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డా.వి. నరేందర్ రెడ్డి, అధ్యక్షుడు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి కోరారు. నగరంలోని వావిలాలపల్లి లో గల అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడుతూ 3 న ఉదయం 5:30 గంటలకు తెలంగాణ చౌక్ నుంచి ఎలగందల వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ర్యాలీలో పాల్గొని పూర్తి చేసిన సైక్లిస్టులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అన్ని వయస్సుల వారు ఈ ర్యాలీలో తమ సైకిల్‌లతో పాల్గొన వచ్చని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు నిత్యం విధిగా సైక్లింగ్ చేయడం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం కలుగుతుందని, పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధ సంక్షోభాల వల్ల చమురు కొరత ఏర్పడడం, చమురు ధరలు పెరగడం వంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తాయని, దీనికి విరుగుడుగా శిలాజ ఇంధన వాహనాల వినియోగాన్ని తగ్గిస్తూ, సైక్లింగ్‌ను ప్రతి ఒక్కరు తమ దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆసక్తి గలవారు 3 న ఉదయం 5:30 గంటలకు తెలంగాణ చౌరస్తా వద్ద సైకిళ్ళతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 9032762247, 9398230614 నంబర్లను సంప్రదించగల రని తెలిపారు. ప్రధాన కార్యదర్శి సురభి వేణు గోపాల్, కోశాధికారి వి.జగదీశ్వరా చారి, కార్యవర్గ సభ్యులు అఖిల్ రెడ్డి, డా: వడ్లూరి శ్రీనివాస్, ఎం. మహెందర్ పాల్గొన్నారు.

# నిరుపేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

**- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**




**మహాదేవపూర్, ముద్ర:** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం కాటారం మండల కేంద్రంలోని బిఎల్ఎన్ గార్డెన్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కాటారం, మల్హర్, మహాదేవపూర్, మహా ముత్తారం మండలాలకు చెందిన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంజూరు పత్రాలను అందజేశారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతుందని ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. మంజూరైన లబ్ధిదారులు 45 రోజులలోగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వ పాలనలో అర్హులకు లబ్ధి జరగలేదని ఈ ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్న బియ్యం, అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తూ ఎన్నికల హామీలో భాగంగా ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామన్నారు.

రైతులకు వ్యవసాయ అవసరాలకు సరిపడ ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఒక సంవత్సరంలో 20 వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలను మహిళలకు అందించామని తెలిపారు. మహిళలను బస్సులకు అధిపతులు చేయాలని ముఖ్యమంత్రి యోచిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మూడు విడుతలలో లబ్ధిదారుల అకౌంట్లో డబ్బు జమవుతుందని పూర్తి పారదర్శకంగా 360డిగ్రీల లో ఏఐ టెక్నాలజీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మహిళ లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు అందజేసి నిర్మాణం పూర్తి చేసేలా ప్రభుత్వం నిర్ణయించిందని లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, ఆర్డిఓ రవీందర్, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాశ్ రెడ్డి, ఉపాధి హామి పథకం రాష్ట్ర సభ్యులు దండు రమేష్, గ్రంథాలయ చైర్మన్ రాజబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల సమ్మయ్య, పిఎసిఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన మంత్రి..

మహదేవ్‌పూర్ మండల కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. మండల కేంద్రంలో ఇండ్లను ) ప్రారంభించగా లబ్ధిదారులు శ్రీధర్ బాబు సహాయం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.

### పర్యావరణాన్ని కాపాడాలి ..

పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ఇందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో కాటారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, డీఎఫ్ఓ నవీన్ రెడ్డి తదితరులు మొక్కలు నాటారు.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

**- ధాన్యాన్ని 24 గంటల్లో అన్ లోడింగ్ చేయాలి**

**- కలెక్టర్ బి.సత్యప్రసాద్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని, మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా ధర్మపురి మండలం జైన, దొంతపూర్ గ్రామాల్లో, బీర్పూర్ మండల కేంద్రం, తుంగూరు గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట డీసీఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సంతానం కల్పిస్తామంటూ మోసం

**ముద్ర, కోరుట్ల:** నిజామాబాద్ జిల్లా కమ్మర్పల్లి మండలం కోనసముందర్ గ్రామానికి చెందిన జంగిటి భార్గవి 26 ఏడు సంవత్సరాల క్రితం రాజేశ్వర్ తో పెళ్లి అవ్వగా వారికి ఇప్పటివరకు సంతానం కలగలేదు. సంతానం గురించి భార్గవి ఆమె భర్త రాజేశ్వర్ తరచూ మెట్పల్లిలోని ప్రైవేట్ హాస్పిటల్ లో చూపించుకునేవారు. అదే క్రమంలో ఇబ్రహీంపట్నం మండలం భర్తీ పూర్ గ్రామానికి చెందిన కిరణ్, అఖిల్ అనే ఇద్దరు వ్యక్తులు రాజేశ్వర్ కి పరిచయమయ్యారు. వారికి పిల్లలు లేరనే విషయం తెలిసి భర్తీపూర్ గ్రామంలో సొంటి మోహన్ అలియాస్ కర్బాల బాబా ఉన్నాడని, మేము అతని అనుచరులం అని చెప్పి బాబా చేత సంతానం కొరకు పూజలు చేయిస్తే మీకు సంతానం కలుగుతుందని నమ్మపలికారు. వారి మాటలు నమ్మి భర్తీపూర్ గ్రామంలోని మోహన్ అలియాస్ (కర్బాల బాబా)ను కలవగా అతను వీరికి సంతానం కలగడానికి పూజ చేస్తానని, అందుకు పూజ సామాగ్రి 50 వేలు ఖర్చు అవుతుందని చెప్పాడు. నమ్మిన దంపతులు ముందుగా 40 వేల రూపాయలను ఇచ్చారు. తేదీ 30.11.2024 రోజున మోహన్ అలియాస్ (కర్బాల బాబా) తన అనుచరులైన అతని అనుచరులు కిరణ్, అకిల్ లను తీసుకొని భార్గవి నివసిస్తున్న గ్రామంలోకి వెళ్లి వారి ఇంట్లో సంతానం కోసం పూజ చేశాడు. సంతానం కలుగుతుందని నమ్మించి భర్తీపూర్ గ్రామానికి బోలేనాథ్ కర్బల దేవాలయానికి రమ్మనగా భార్గవి దంపతులు అక్కడికి వెళ్ళారు.

కొన్ని రోజుల తర్వాత ఒక లక్ష రూపాయలు డిమాండ్ చేశాడు. అంత డబ్బు లేదని 40,116/- రూపాయలు నగదు రూపేనా బాబా అనుచరులు అయిన కిరణ్ మరియు అఖిల్ అను వ్యక్తులకు ఇచ్చారు. కానీ పూజ జరిగి సంవత్సరం గడిచిన సంతానం కలగలేదని బాబాను, అతని అనుచరులు అఖిల్ కిరణ్ లను మా డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగగా భార్గవి ఆమె భర్త రాజేశ్వర్ లను చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ విషయమై భార్గవి దంపతులు భర్తీ పూర్ గ్రామానికి చెందిన మోహన్ అలియాస్ (కర్బాల బాబా) కిరణ్, అఖిల్ అనే వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై జీ. నవీన్ తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 02.06.2026
www.mudranews.in | @mudranews



### ఆవకాయతో ఆకలిని పెంచుతుంది

జ్వరం లేదా నీరసం వల్ల నోటికి రుచి తెలియనప్పుడు కొద్దిగా ఆవకాయ తింటే నాలుకకు రుచి వస్తుంది. ఇది లాలాజలాన్ని ఊరేలా చేసి, ఆకలిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తుంది.



## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల నియామకం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** టి పి సి సి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆమోదంతో స త్తుపల్లి నియోజకవర్గంలోని మం డల అధ్యక్షులను నియమించినట్టు జిల్ల కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తల్లాడ మండల అధ్యక్షులుగా గొడుగునూరి లక్ష్మీరెడ్డిని, కల్లూరు మండల మండల అధ్యక్షులుగా పోట్రూ అర్జునరావు,పెనుబల్లి మండల అధ్యక్షులుగా పంది వేంకటేశ్వరరావు, సత్తుపల్లి మండల అధ్యక్షులుగా భీమిరెడ్డి సుబ్బారెడ్డి, వేంసూరు మండల అధ్యక్షులుగా కాసర చంద్రశేఖర రెడ్డి లను, సత్తుపల్లి పట్టణ అధ్యక్షులుగా గాదె చిన్నకేశవరావు, కల్లూరు పట్టణ అధ్యక్షులుగా షేక్ ఉస్మాన్ లను నియమించినట్లు వివరించారు.

గత దశాబ్దకాలంగా కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించిన మాజీ మండల అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా వారికి అధినాయకత్వ సహకారంతో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**రాష్ట్ర ముఖ్యమంత్రిki గ్రామపంచాయతీ కార్మికులు వారి సమస్యలు గుర్తుకు రావట్లేదా ? అని తెలంగాణ గ్రామ పంచాయతి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి పాండు అన్నారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో భువనగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట పెండింగ్ వేతనాలు చెల్లించాలని సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేసి ఇంచార్జ్ ఎంపీడీవో దయాకర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు రెగ్యులర్ గా వేతనం చెల్లించడం లేదని పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచడం లేదన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల పట్ల ఎందుకు నిర్లక్ష్యమని ప్రశ్నించారు. చిత్తశుద్ధితో ఇప్పటికైనా ఏళ్ల తరబడిగా పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు పెరుగుతున్న ధరల కనుకూలంగా వేతనాలు పెంచి రెగ్యులర్ గా వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు బొల్లేపల్లి స్వామి, నాయకులు శంకర్, ఐలయ్య, సత్తయ్య, సంజీవ పాల్గొన్నారు.

## పటేల్ రమేష్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు

**- తెలిపిన టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా యూనిట్**



**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** సోమవారం రమేష్ రెడ్డి నివాసంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ బంటు, సీనియర్ జర్నలిస్టులు తండు వెంకన్న గౌడ్, షేక్ రషీద్, గుడిపూడి రామకృష్ణ, సురేందర్, కందుకూరి యాదగిరి, షేక్ జహీర్, రామచంద్ర రాజు, దుస్సా చంద్రశేఖర్, దుర్గం బాలు, పోలోజు సందీప్, వెంకట్, మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్లు గొర్ల కాపర్లకు అందుబాటులో ఉండాలి

**- జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మండల పశువైద్యశాల పరిధిలో గల సబ్ సెంటర్ ల డాక్టర్లు గొర్ల మేకల కాపర్లకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని జిఎంపీఎస్ (గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం) జిల్లా కార్యదర్శి దయ్యాల నర్సింహా కోరారు. సోమవారం భువనగిరి మండలంలోని ముస్త్యాల పెల్లి , చీమల కొండూరు, రాయగిరి గొర్రెల మందల ను సందర్శించి, గొర్ల కాపరులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముస్త్యాలపల్లి , చీమల కొండూరు గ్రామానికి సంబంధించిన డాక్టర్ సుమారు 6 నెలల సుమారు ఆరు నెలల నుంచి గొర్ల కాపరులకు అందుబాటులో లేడని, ఫోన్ చేసిన స్పందించడం లేదని ఆరోపించారు. ఉచిత టీకాలను సకాలంలో పంపిణీ చేయకపోవడం వలన, గొర్ల కాపరులు ప్రైవేట్ మందులను కొనుగోలు చేసి, ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మండల కార్యదర్శి పాక జహంగీర్, మండల అధ్యక్షులు దేవునూరి బాల య్య, జిల్లా కమిటీ సభ్యులు మన్నెబోయిన రాజలింగం, మండల ఉపాధ్యక్షులు పార్వతి దశరథ, తోటకూర అశోక్, సహాయ కార్యదర్శి వడ్డే జమదగ్ని, ఆయా గ్రామాల సంఘం అధ్యక్షులు వడ్డే రమేష్, చిన్నం శ్రీనివాస్, కాపరులు నారి శ్రీశైలం, అంజయ్య, బోదాసు వెంకటయ్య, చిన్నం జమాల్ లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే, ఎంపీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అవైస్ చిస్తీ, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# బీజేపీ పన్నెండేళ్ల పాలన అస్తవ్యస్తం

**- మునుపెన్నడూ లేనంతగా ధరల భారం పడుతోంది**

**- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలన అస్తవ్యస్తంగా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ విమర్శించారు. ప్రజలపై భారాలు మోపుతూ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. సోమవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సింగన్న గూడెం బైపాస్ వద్ద కామ్రేడ్ బట్టుపల్లి శ్రీనివాస్ 15వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు కొలుపుల కృష్ణ పార్టీ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం "బీజేపీ 12 ఏళ్ల పాలన – విద్వేషం, వైఫల్యాలు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు గంధ మల్ల మాతయ్య అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ, బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై మరింత ఆర్థిక భారం మోపుతోందన్నారు. దేశంలో మునుపెన్నడూ లేనంతగా ధరలు పెరిగాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 2014లో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు బ్యారెల్ ధర 105 డాలర్లు ఉన్నప్పుడు పెట్రోల్ ధర లీటరుకు రూ.72గా ఉండేదని, ప్రస్తుతం చమురు ధర తగ్గినప్పటికీ పెట్రోల్ ధర రూ.110కు చేరుకుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఎక్సైజ్ సుంకం, రాష్ట్రాల వ్యాట్, డీలర్ల కమిషన్‌ల కారణంగా ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు. అదే విధంగా నిత్యావసర వస్తువుల ధరలు కూడా విపరీతంగా పెరిగి పేద, మధ్యతరగతి ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఎండగట్టాలని, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, సూర్యాపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెరుమాండ్ల అన్నపూర్ణ శ్రీనివాస్, బీఎస్పీ నాయకుడు బట్టు రామచంద్రయ్య, 26వ వార్డు కౌన్సిలర్ చీమల రాజు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు గౌడ్, కల్లూరి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ, దయ్యాల నరసింహ, సిరిపంగి స్వామి, గడ్డం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజావాణి' దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**

వివిధ సమస్యల పై ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 89 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.

అందులో రెవిన్యూ శాఖ 46, జిల్లా గ్రామీణాభివృది 8, డివిజనల్ పంచాయతీ 5, మున్సిపాలిటీ 4, పి డి హౌసింగ్ 3, సివిల్ సప్లై 2, మైనింగ్2, సర్వే ల్యాండ్ 2, జిల్లా పరిషత్ 2, ఇరిగేషన్ 2, ఎలక్ట్రిసిటీ, ఎక్సైజ్ పర్సంవర్ధక, యస్ సి కార్పొరేషన్, శిశు సంక్షేమ, బీసీ వెల్ఫేర్, ఎంప్లాయిమెంట్, మత్స్య, చేనేత, అగ్రికల్చర్, విద్య, లీగల్ సెల్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## అర్ధరాత్రి రోడ్లపై హద్దుమీరి ప్రవర్తించిన యువకులపై కేసులు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ ట్రోఫీ గెలుచుకున్న ఆనందంలో ఖమ్మం నగరంలో అర్ధరాత్రి రోడ్లపై హద్దుమీరి ప్రవర్తించిన యువకులపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు.

ఆదివారం రాత్రి ఖమ్మం జడ్పీ సెంటర్ వద్ద కొంతమంది యువకులు రోడ్లపైకి వచ్చి మోటార్‌సైకిళ్లపై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ, ప్రమాదకర విన్యాసాలకు పాల్పడుతూ చక్కర్లు కొట్టారని తెలిపారు. సైలెన్సర్ల మోతతో ప్రజలకు, వాహనదారులకు అసౌకర్యం కలిగించడమే కాకుండా టపాసులు కాల్చి భయాందోళనలకు గురి చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఏడుగురు యువకులపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, ఐదు మోటార్‌సైకిళ్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా మరికొంతమంది యువకులను గుర్తించి వారిపై కూడా కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. పుట్టినరోజుల పేరుతో పార్టీలు నిర్వహిస్తూ అర్ధరాత్రి సమయంలో మద్యం సేవించి రోడ్లపై హంగామా చేస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. చదువుకునే యువత ఇలాంటి కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను రాత్రి 10 గంటల తర్వాత ద్విచక్ర వాహనాలతో బయటకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ కోరారు.

## యువతకు సాంకేతిక నైపుణ్యాలు అత్యవసరం

**- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, వృత్తి పరమైన శిక్షణ ఎంతో అవసరమని పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం (టీమ్ సొసైటీ), మ్యాజిక్ బస్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకుల కోసం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా తరగతులను సోమవారం భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి శిక్షణా శిబిరాన్ని అధికారికంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఉద్యోగ సంబంధిత శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు మరింత విస్తృతంగా లభిస్తాయని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకుని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడం, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. శిక్షణ ద్వారా యువత ఉద్యోగ రంగంలో పోటీ పడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తీ, జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితి, ఆర్డీవో కృష్ణారెడ్డి, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి

**- ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**

**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి:**

మన్నిక గల సేవలను అందించి వినియోగదారుల మన్ననలు పొందాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.

సూర్యాపేట పట్టణంలోని కొత్త మార్కెట్ రోడ్డులో రాయల్ కార్ వాష్ షోరూం★ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే సంస్థలు అభివృద్ధి బాటలో నడుస్తాయని బిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పోతు భాస్కర్, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, కొండపల్లి దిలీప్ కుమార్ రెడ్డి, ఫరూకు, మొరిశెట్టి లక్ష్యాది, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు,



## ప్రభుత్వ పాఠశాలల, హాస్టళ్ల మరమ్మతుల వివరాలను నమోదు చేయాలి

**-: జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**

యాదాద్రి భువనగిరి జిల్లాలో పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, అక్కడ ఉన్న సౌకర్యాలు, మౌలిక వసతులు, మరమ్మతుల అవసరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఫర్నిచర్ తదితర వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మండల స్పెషల్ అధికారులకు ఆన్‌లైన్ యాప్ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నమోదు చేసిన వివరాల ఆధారంగా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 02.06.2026
www.mudranews.in | @mudranews



## ఆవకాయతో సహజ సిద్ధమైన ప్రోబయోటిక్స్

ఊరగాయ ముక్కలు ఊరే ప్రక్రియలో మంచి బ్యాక్టీరియా (ప్రోబయోటిక్స్) వృద్ధి చెందుతాయి. ఇవి మన ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచి, జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి.





# ఫోన్ ట్యాపింగ్ తీవ్ర నేరం

**- దోషులకు చట్టప్రకారం శిక్ష పడాలి**
**- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

<u>ముద్ర ప్రతినిధి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా:</u>

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని అత్యంత తీవ్రమైన నేరంగా పరిగణించి, ఇందులో దోషులుగా తేలిన వారికి చట్టప్రకారం శిక్ష విధించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశం తన వ్యక్తిగత సమస్య కాదని, తెలంగాణ ప్రజల రాజ్యాంగబద్ధమైన హక్కులకు సంబంధించిన అత్యంత కీలకమైన విషయమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని కమిషనర్ ఆఫ్ పోలీస్, ఐసీసీసీ కార్యాలయంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారుల ఎదుట హాజరై తన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు తన మొబైల్ ఫోన్ ట్యాపింగ్‌కు గురైందని, దీనిపై తొలిసారిగా డీజీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఫిర్యాదులు చేశారని చెప్పారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు.

ఫోన్ ట్యాపింగ్ అనేది కేవలం ఫోన్ సంభాషణలను వినడమే కాకుండా, వ్యక్తిగత జీవితం, కుటుంబ వ్యవహారాలు, వ్యక్తిగత స్వేచ్ఛలో అక్రమ జోక్యం చేసుకోవడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి గోప్యత హక్కు కల్పించబడిందని, సుప్రీంకోర్టు పుట్టస్వామి తీర్పు ద్వారా గోప్యతను ప్రాథమిక హక్కుగా గుర్తించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఆర్టికల్ 19 ప్రకారం భావ ప్రకటన స్వేచ్ఛకు హామీ ఉందని, ఫోన్లు ట్యాప్ అవుతున్నాయనే భయం ఉంటే ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడలేరని అన్నారు. భయం ఉన్న చోట స్వేచ్ఛ ఉండదని, స్వేచ్ఛ లేని చోట ప్రజాస్వామ్యం ఉండదని యెన్నం శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రత్యర్థులపై నిఘా పెట్టడం ప్రజాస్వామ్యంపై దాడితో సమానమని, రాజకీయ పోటీ ప్రజల మధ్య ఎన్నికల్లో జరగాలని, గూఢచర్య మార్గాల్లో కాదని స్పష్టం చేశారు. తెలంగాణలో నిఘా ద్వారా రాజకీయాలను ప్రభావితం చేసే ప్రయత్నాలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కేవలం రాజకీయ నాయకులకు మాత్రమే పరిమితం కాదని, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు, న్యాయవాదులు, విద్యార్థులు సహా ప్రతి మొబైల్ వినియోగదారుడి హక్కులకు సంబంధించిన అంశమని అన్నారు. తెలంగాణ ఉద్యమం స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం జరిగిందని, నిఘా రాజ్యం కోసం కాదని స్పష్టం చేశారు. ఈ కేసులో పూర్తి నిజాలు వెలుగులోకి రావాలని, ఎవరు ఆదేశించారు, ఎవరు అమలు చేశారు, ఎంతమంది ప్రభావితులయ్యారు అనే అంశాలపై ప్రజలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అన్నారు.

ఈ విచారణ ప్రతీకారం కోసం కాదని, రాజ్యాంగ పరిరక్షణ కోసం జరుగుతోందని తెలిపారు. ఈ కేసులో ఎవరి ప్రమేయం ఉన్నా, వారు ఎంతటి ఉన్నత స్థానాల్లో ఉన్నా చట్టం ముందు సమాధానం చెప్పాల్సిందేనని, ప్రజాస్వామ్యంలో ఎవరూ చట్టానికి అతీతులు కారని యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిరాజ్ ఖాద్రీ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

# విద్యార్థుల సంక్షేమానికి మరో అడుగు

**- ఎంపీ మల్లు రవి చొరవతో**
**80 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ**

<u>ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:</u>

గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధి, రవాణా సమస్యల పరిష్కారానికి నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి ప్రత్యేక చొరవతో సోమవారం నాగర్ కర్నూల్ ఐడీఓసీ కార్యాలయ ఆవరణలో 80 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. జిందాల్ స్టీల్ అండ్ పవర్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న 74 మంది విద్యార్థులతో పాటు నార్లాపూర్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి,



జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ, తన విద్యార్థి దశలో ప్రతి రోజూ ఐదు కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వెళ్లిన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. గ్రామీణ విద్యార్థులు రవాణా ఇబ్బందులు ఎదుర్కోకుండా, సమయానికి పాఠశాలకు చేరుకుని చదువుపై మరింత దృష్టి పెట్టేందుకు సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత నిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.

త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు షూల పంపిణీ కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు.

అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ, సైకిల్ వినియోగం ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన పెంపొందిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు.

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, సైకిళ్ల పంపిణీ గ్రామీణ విద్యార్థుల చదువుకు ఎంతో దోహదపడుతుందని, వారి హాజరు శాతం పెరిగి విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎంపీ మల్లు రవి, జిందాల్ స్టీల్ అండ్ పవర్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఈఓ రమేష్ కుమార్, కౌన్సిలర్ చంద్రకళ, జిందాల్ సంస్థ ప్రతినిధి రెడ్డి నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హాస్టళ్లలో ఆహార భద్రత ప్రమాణాలు అమలు చేయాలి

**- పండ్ల గోదాములపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి**
**- కలెక్టర్ సీహెచ్ ప్రియాంక**

<u>ముద్ర ప్రతినిధి, నారాయణపేట:</u>

జిల్లా వ్యాప్తంగా ఆహార భద్రత తనిఖీలను మరింత ముమ్మరం చేసి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆహార వ్యాపార సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లలో ఆహార భద్రత ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో కృత్రిమ పక్వానికి పాల్పడే వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. కాల్షియం కార్బైడ్ వంటి నిషేధిత రసాయనాలను ఉపయోగించి పండ్లను పక్వానికి తెచ్చే వారిపై తనిఖీలు నిర్వహించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారుల సమన్వయంతో పట్టణంలోని పండ్ల గోదాములను తనిఖీ చేయాలని సూచించారు. వినియోగదారులకు సురక్షితమైన పండ్లు అందేలా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని చెప్పారు. ఆహార వ్యాపార సంస్థల యజమానులు తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన వ్యాపారులు సంబంధిత కార్యాలయాన్ని సంప్రదించి లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలో నిర్మాణాలు పూర్తయిన మూడు ఇందిరమ్మ ఇండ్లను సోమవారం జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ప్రారంభించారు. నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకు చెందిన ఉజ్జెల్లీ నర్సమ్మ, 4వ వార్డుకు చెందిన వరలక్ష్మి, 9వ వార్డుకు చెందిన దాసరి కమలశ్రీలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను పురపాలక చైర్‌పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్, కొత్త ఇంటిలో ప్రవేశించిన సందర్భంగా వారి ఆనందాన్ని పంచుకున్నారు. కుటుంబ సభ్యులు, పిల్లల చదువులు, జీవన పరి



స్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, పుర వైస్ చైర్‌పర్సన్ మంజుల, వార్డు కౌన్సిలర్లు మహేశ్, గొల్ల రవితేజ యాదవ్, రాజేష్ ఘట్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణికి 23 ఫిర్యాదులు

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి మొత్తం 23 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రజా ఆస్తులు నిర్వీర్యం

**- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవేదన**

<u>ముద్ర కూకట్ పల్లి:</u>

కె.పి.హెచ్.బి డివిజన్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం పరిశీలించారు. గతంలో నిధులు మంజూరై ప్రస్తుతం కొనసాగుతున్న నూతన పైప్‌లైన్లు, రోడ్డు పనులు మరియు ఇతర ప్రగతి కార్యక్రమాలను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కె.పి.హెచ్.బి డివిజన్ అభివృద్ధికి వందల కోట్ల నిధులు మంజూరు చేయించామని గుర్తుచేశారు. ముఖ్యంగా నాల్గవ ఫేజ్‌లోని నిరుపేదలకు ఉపయోగపడేలా అత్యాధునిక సదుపాయాలతో కమ్యూనిటీ హాల్, మహిళల కోసం మహిళా మండలి భవనాన్ని నిర్మించామని తెలిపారు. అయితే కాంగ్రెస్



ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటిని కనీసం పట్టించుకోకపోగా, ఆ పార్టీ నాయకులు తాళాలు దగ్గర పెట్టుకుని భవనాలను బూజు పట్టేలా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను భయపెట్టి నిరుపేదలకు ఉపయోగపడే ప్రజా ఆస్తులను నిర్వీర్యం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పేదలు తక్కువ ఖర్చుతో శుభకార్యాలు చేసుకోవాలనే ఉద్దేశంతో కమ్యూనిటీ హాల్ కట్టించాం. కాంగ్రెస్ నాయకుల తీరు వల్ల నేడు అవి చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఇదా కాంగ్రెస్ మార్క్ అభివృద్ధి. గతంలో నిరుపేదలకు నీటి ఇబ్బంది లేకుండా పైప్‌లైన్లు, వాటర్ ట్యాంకులు నిర్మించి ఉచితంగా తాగునీరు అందించామని, నేడు నీటి కొరతతో ప్రజలు అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల కోసం తాము నిర్మించిన పార్కులు, స్విమ్మింగ్ పూల్స్, ఇండోర్ స్టేడియంలను కాంగ్రెస్ నాయకులు పాడుబెడుతున్నారని, ప్రజలే దీనిని గమనించాలని కోరారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తాను ఎప్పుడూ అభివృద్ధికి సహకరిస్తానని, కానీ ఇలాంటి ప్రజావ్యతిరేక పనులకు పాల్పడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉప్పల్ లో తాగునీటి సమస్యలపై సమీక్ష

**- వాటర్ వర్క్స్ అధికారులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



<u>ముద్ర ప్రతినిధి, కాప్రా:</u>

ఉప్పల్ నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, నీటి ఒత్తిడి సమస్యలు, పైప్‌లైన్‌ల నిర్వహణ, మురుగునీటి పారుదల అంశాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వాటర్ వర్క్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో వాటర్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) పంకజా, జనరల్ మేనేజర్ (జీఎం) సంతోష్‌తో కలిసి నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో నెలకొన్న తాగునీటి సమస్యలపై ఎమ్మెల్యే చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న నీటి కొరత, తక్కువ ఒత్తిడితో నీటి సరఫరా వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వేసవి కాలంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని అధికారులకు సూచించారు. పాత పైప్‌లైన్‌ల కారణంగా తరచుగా ఏర్పడుతున్న లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే మురుగునీటి సమస్యలు అధికంగా ఉన్న కాలనీల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే కోరారు.

సమావేశంలో అధికారులు నియోజకవర్గంలో కొనసాగుతున్న వాటర్ వర్క్స్ అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సేవలు అందించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేసి తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరచాలని ఎమ్మెల్యే సూచించారు.

# ఘనంగాతెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

<u>ముద్ర, తాండూర్ ప్రతినిధి:</u>

ఎన్నో పోరాటాలు, మరెన్నో బలిదానాల ఫలితంగా కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమ కారుల ఆత్మీయ సమ్మేళనం వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షులు పిడపర్తి రవి, ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డు, గౌరవ వేతనం హెల్త్ కార్డు, రవాణా సదుపాయం తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మన హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన



ఉద్యమకారులు తమ దగ్గర ఉన్న ఆధారాలను ఉద్యమ సమయంలో జైలుకెళ్ళిన వారు, లాటి దెబ్బలు తిని అరెస్టు అయిన వారు, కాలుకు గజ్జ కట్టి పాటలు పాడిన వారు, తదితర రంగాల్లో పోరాటాలు చేసిన వారు టీవీ యాడ్స్, పేపర్ కటింగ్, మనం ఉద్యమంలో పాల్గొన్నట్టు ఏవైనా ఆధారాలు ఉన్న ఉద్యమకారులందరూ కలసికట్టుగా, రాష్ట్ర నాయకత్వం ఎప్పుడు పిలుపునిచ్చిన మన హక్కుల సాధన కోసం మనందరం కలసికట్టుగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు హాజీపూర్ మాజీ సర్పంచ్ ఒంగోని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు సంజయ్ గౌడ్, అధ్యాపకులు పర్యాద రామకృష్ణ, అడ్వకేట్ జిలాని, వీరమని, కేశవులు, కృష్ణ ముదిరాజ్, బంటారం భద్రేశ్వర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

**ముద్ర, మల్కాజిగిరి:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌కు రానున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేపట్టారు. బేగంపేట, క్లాక్ టవర్, సంగీత్ జంక్షన్, బోయిన్‌పల్లి, ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాల్లో వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ప్రయాణికులు ముందుగానే తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకుని, పరేడ్ గ్రౌండ్ పరిసర మార్గాలను వీలైనంత వరకు నివారించాలని సూచించారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No.6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu. Rockdale compound, Somajiguda, Hyderabad-500082 Editor Y Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email mudradailys@gmail.com